## గిరిజన విద్యార్థుల జీవితాలతో చెలగాటం..!




**-పోషకాహారం, వైద్య సేవల కొరతపై తీవ్ర ఆరోపణలు**
**- అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు**
**-ఐటిడిఏ పివో వెంటనే తనిఖీ చేయాలని గిరిజన సంఘాల డిమాండ్**

www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
ఆదివారం | 12 | జూలై | 2026
పేజీలు : 8

# సీతారామను సత్వరం పూర్తి చేయండి

**-ముఖ్యమంత్రికి సిపిఐ వినతి**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఉమ్మడి ఖమ్మంజిల్లా సాగు నీటికి సంబంధించి ప్రధాన జీవనాధారంగా ఉన్న సీతారామ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఖమ్మం జిల్లాలో రెండున్నర లక్షల ఎకరాల నూతన ఆయకట్టుకు సాగునీటిని ఇవ్వడంతో పాటు నాలుగున్నర లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు సంబంధించి ప్రారంభించిన సీతా రామ ప్రాజెక్టు నిధుల

మిగతా 2లో..

## భూ రీ సర్వేకు
# అత్యంత ప్రాధాన్యత



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** భూ భారతి చట్టం సమర్థవంతంగా అమలు కావాలంటే రాష్ట్ర వ్యాప్తంగా భూ రీ సర్వే ను అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. భూ రీ సర్వే, భూ భారతి అమలు, సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారం, ఇందిరమ్మ ఇండ్లు, 2బిహెచ్‌కె ఇండ్ల పంపిణీ, పాఠ

**-సాదాబైనామాను వేగవంతం చేయండి**
**-ఆగస్టు 15 నాటికి ప్రతి విద్యార్థికి యూనిఫాం**
**-జిల్లా కలెక్టర్లతో మంత్రి పొంగులేటి వీడియో కాన్ఫరెన్స్**

శాల విద్యార్థులకు యూనిఫాంల పంపిణీ తదితర అంశాలపై మంత్రి శనివారం ఖమ్మం జిల్లా కలెక్టరేట్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో

మిగతా 2లో..

## ఆరు కండ్లు ఉండి మీరేం చేశారు..?



**ప్రజాపక్షం/ఖమ్మం :** తనకు ఒక కన్ను ఉందని వ్యక్తిగత విమర్శలు చేస్తున్నా కాంగ్రెస్ నాయకులు జిల్లాలో ఆరు కండ్లు ఉన్న ముగ్గురు మంత్రులు ఏమి చేశారని మాజీ మంత్రి, బిఆర్ఎస్ నేత పువ్వాడ అజయ్‌కుమార్ ప్రశ్నించారు. వ్యక్తిగత విమర్శలు, వ్యక్తిత్వ హననం రేవంత్‌రెడ్డి ఎజెండా అని ఆయన తెలిపారు. శనివారం ఖమ్మంలో పువ్వాడ స్వగృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో తాను ఒక కన్నును కోల్పోయానని గతంలోనూ కొందరు నన్ను ఇలానే విమర్శించారని

**-వ్యక్తిత్వ హననమే రేవంత్ ఎజెండా**
**-హామీల అమలుకు ఏమి వైకల్యం అడ్డొచ్చింది**
**-సీతారామ ముమ్మాటికి కేసిఆర్ ఆలోచనే**
**-మీడియా సమావేశంలో మాజీ మంత్రి అజయ్**

కానీ ఆరు కండ్లు ఉన్న ముగ్గురు మంత్రులు ఏమి చేశారో ఈ జిల్లాలో నేను ఏమి చేశానో రేవంత్ తెలుసుకుంటే మంచిదన్నారు. ముఖ్యమంత్రి స్థాయిలో ఉండి దిగజారుడు విమర్శలు చేస్తుంటే సహచర మంత్రులు

మిగతా 2లో..

## సాంస్కృతిక విప్లవం ద్వారా సమాజం మార్పు

**-తన కంఠంతో అమరత్వాన్ని రమణీయం చేసిన నాగన్న**
**-నాగన్న సంస్మరణ సభలో ప్రొ॥ కొండా నాగేశ్వరరావు**
**-నాగన్నకు నివాళులర్పించిన వామపక్ష విప్లవోద్యమ నాయకులు, కవులు, కళాకారులు**







**ప్రజాపక్షం/ఖమ్మం :** సాంస్కృతిక విప్లవం ద్వారా సమాజ మార్పు తథ్యమని కళ ద్వారా సమాజ మార్పు కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరూ అభినందనీయులని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొ॥ కొండా నాగేశ్వరరావు తెలిపారు. సాంస్కృతి ఉద్యమం ప్రజలను మారుస్తుందని తద్వారా ప్రజలు సమాజాన్ని మారుస్తారని ఆయన తెలిపారు. ఇటీవల మరణించిన అరుణోదయ నాగన్న సంస్మరణ సభ శనివారం స్థానిక భక్తరామదాసు కళాక్షేత్రంలో జరిగింది. నాగన్న మిత్ర మండలి ఏర్పాటు చేసిన ఈ సంస్మరణ సభకు స్పర్శ అధ్యయన వేదిక బాధ్యులు కాకి భాస్కర్ అధ్యక్షత వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన కొండా నాగేశ్వరరావు మాట్లాడుతూ నాగన్న జీవితం ఎందరికో ఆదర్శమని నిరుపేద కుటుంబంలో పుట్టి కళను సాధనంగా చేసుకుని తుదిశ్వాస వరకు ప్రజా చైతన్యానికి పాటుపడిన వ్యక్తి అన్నారు. అన్న అమరుడురా అన్న పాటతో అత్యంత ప్రాచుర్యం పొందటమే కాకుండా అమరత్వాన్ని తన గానంతో రమణీయం చేసిన మహోన్నతుడన్నారు. ఒక పక్క ఫాసిజం పెరిగిపోతూ ఆ ఫాసిజాన్ని వ్యతిరేకించిన వారిని దేశద్రోహులుగా ముద్రిస్తున్న సమయంలో

మిగతా 2లో..

# భూ రీ సర్వేకు అత్యంత ప్రాధాన్యత

**(మొదటిపేజీ తరువాయి)** వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. హైదరాబాద్ నుంచి రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డిఎస్ లోకేష్ కుమార్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఖమ్మం జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ధరణిని రద్దు చేసి భూ భారతి చట్టాన్ని తీసుకు వచ్చామన్నారు. రైతుల భూములకు పూర్తి భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. భూ భారతి అమల్లోకి వచ్చి 15 నెలలు పూర్తయినా ప్రజల అంచనాలకు పూర్తి స్థాయిలో చేరలేకపోయామని తెలిపారు. ధరణి కాలంలో పెండింగ్‌లో ఉన్న 9.26 లక్షల సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారం కోసం భూ భారతిలో అవకాశం కల్పించి హైకోర్టు సమస్యను కూడా పరిష్కరించినప్పటికీ అధిక సంఖ్యలో దరఖాస్తులు తిరస్కరణకు గురవుతున్నాయనే అభిప్రాయం ప్రజల్లో ఉందన్నారు. తిరస్కరణలకు గల కారణాలను గుర్తించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. భూ భారతి చట్టం సమర్థవంతంగా అమలు కావాలంటే భూ రీ సర్వే తప్పనిసరి అని మేధావులు సూచించడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఇందు కోసం శిక్షణ పొందిన లైసెన్స్ సర్వేయర్ల సేవలను వినియోగించుకోవాలన్నారు. రెగ్యులర్ సర్వేయర్లు, లైసెన్స్ సర్వేయర్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పైలట్ ప్రాజెక్టుగా నక్షాలు లేని 413 ప్రాంతాల్లోని ఐదు గ్రామాల్లో నిర్వహించిన రీ సర్వేతో 95 శాతం వరకు భూ సమస్యలు పరిష్కారమయ్యాయని తెలిపారు. తొలి విడతలో ప్రతి జిల్లాలో 70 గ్రామాలను ఎంపిక చేసి రీ సర్వే చేపట్టినట్లు తెలిపారు. మార్చి 2027 నాటికి మూడు విడతల్లో రీ సర్వే పూర్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రీ సర్వేలో పనిచేసే లైసెన్స్ సర్వేయర్లకు ఎకరానికి రూ. 50తో పాటు రవాణా, ఇతర ఖర్చుల కోసం మరో రూ.10 చెల్లించి మొత్తం రూ. 60లు అందజేస్తామని తెలిపారు. మొదటి విడత ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 2బిహెచ్‌కె ఇండ్లను ప్రస్తుత స్థితిలోనే లబ్దిదారులకు అందజేసి మిగిలిన పనులకు నిధులు విడుదల చేయాలని ఆదేశించారు. రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డిఎస్ లోకేష్‌కుమార్ మాట్లాడుతూ తొలి విడతలో ఎంపిక చేసిన 70 గ్రామాల్లో భూ రీ సర్వేను నవంబర్ లోపు పూర్తి చేయాలన్నారు. రెండవ విడతలో మరో 70 గ్రామాల్లో మార్చి 2027 లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. తెలంగాణ హౌసింగ్ కార్పోరేషన్ ఎండి విపి గౌతమ్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన సర్వేలో గుడిసెలను గుర్తించిన వాటిలో ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసే ప్రక్రియ కొనసాగుతుందన్నారు. సెర్ప్ సిఈవో దివ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల విద్యార్థుల యూనిఫాంలన్నీ స్వయం సహాయక సంఘాల మహిళా టైలర్ల ద్వారానే కుట్టిస్తున్నామని తెలిపారు. జులై 15లోపు రెసిడెన్షియల్ బాలికలకు, జులై 30లోపు బాలురకు యూనిఫాంలు అందించాలని సూచించారు. ఆగస్టు 15 నాటికి రాష్ట్రంలోని ప్రతి విద్యార్థికి కనీసం ఒక జత యూనిఫాం అందేలా కలెక్టర్లు, డిఆర్‌డిఏ, గురుకులాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ తిరుమలాయపాలెం మండలం కాకరవాయి గ్రామంలో భూ రీ సర్వే చేపట్టామన్నారు. నాలుగు యంత్రాలను సిఎస్ఆర్ నిధుల ద్వారా కొనుగోలు చేశామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఖమ్మం ఆర్డీవో ఎస్. శ్రీనివాస్, తహసీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.

# సాంస్కృతిక విప్లవం ద్వారా సమాజం మార్పు

**(మొదటిపేజీ తరువాయి)**

సాంస్కృతిక కళా ఉద్యమం మరింతగా విస్తరించాల్సిన సమయమిది అన్నారు. అనేక విప్లవ ఉద్యమాల విజయాల వెనక సాంస్కృతిక ఉద్యమం దాగి ఉందని నాగేశ్వరరావు తెలిపారు. తాను నమ్మిన సిద్ధాంతం కోసం కడ వరకు పనిచేసిన నాగన్న కేవలం కళాకారుడు మాత్రమే కాదని ఒక నిబద్ధత కలిగిన కమ్యూనిస్టు కార్యకర్త అన్నారు. శ్రీపాద శ్రీహరి అమరత్వం తర్వాత చైతన్యం పొంది కళాకారునిగా ఉమ్మడి రాష్ట్రంలో పలు ప్రదర్శనలు ఇచ్చిన నాగన్న స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలలో పనిచేయడమే నాగన్నకు మనమిచ్చే సరైన నివాళి అన్నారు. నాగన్న భౌతికంగా మన మధ్య లేకపోయినా ఆయన చూపిన మార్గం, ఆచరించిన సిద్ధాంతం సజీవంగా ఉన్నాయని ఆయన ఆలపించిన వందల పాటలు ఆయన రచించిన చైతన్య గీతాలు ఈ సమాజాన్ని నిత్యం మేల్కొపుతూనే ఉంటాయన్నారు. సభలో పాల్గొన్న సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ మాట్లాడుతూ కమ్యూనిస్టు ఉద్యమం ఇప్పుడు సరికొత్త సవాళ్లను ఎదుర్కొంటుందన్నారు. ఈ సవాళ్లను అధిగమించడానికి కళలు ఆయుధంగా ఎంచుకున్న నాగన్న తుదిశ్వాస వరకు ప్రజా చైతన్యం కోసం పని చేశారన్నారు.పెట్టుబడిదారి సమాజం కళను సైతం వ్యాపార వస్తువుగా మార్చి పెట్టుబడిదారి అనుకూల వాతావరణాన్ని సృష్టిస్తున్న నేటి సమాజంలో నాగన్న ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. నాగన్న సంస్మరణ సభ సందర్భంగా అరుణోదయ, ప్రజా




నాట్యమండలి, ప్రజా కళామండలి కళాకారులు ఆలపించిన గేయాలు సభికులను ఆలోచింపజేశాయి. ముఖ్యంగా నాగన్న వారసుడు అజయ్ అలపించిన అన్న అమరుడురా అన్న పాటతో ఈ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సభలో నాగన్నపై యోచన రాసిన పాటలను అతిథులు ఆవిష్కరించారు. ఆటపాటతో సాగిన ఈ సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, న్యూడెమోక్రసీ నాయకులు ఆవునూరి మధు, బిఆర్ఎస్ నాయకులు ఏనుగుల రాకేష్‌రెడ్డి, అరుణోదయ విమలక్క, యోచన, ఎస్‌పాల్, దేవేందర్, మిత్ర మండలి సభ్యులు బిచ్చాల తిరుమలరావు, విజయ్, చిర్రా రవి, మానుకోట ప్రసాద్, కోటి పాల్గొన్నారు.

# ఆరు కండ్లు ఉండి మీరేం చేశారు..?

**(మొదటిపేజీ తరువాయి)**

ఏమి చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. తన మీద సిఎంకు మంత్రులకు ఉన్న కక్ష తీర్చుకునేందుకు విధానపరమైన విమర్శలు చేసేందుకు ఆస్కారం లేక కన్ను, పన్ను లేదని మాట్లాడుతున్నారని కానీ ఇచ్చిన హామీలు అమలు చేసేందుకు వీరికి ఏ అంగవైకల్యం అడ్డు వచ్చిందని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల సందర్భంగా అనేక హామీలు ఇచ్చారని బాండు పేపర్లరు జాగ్రత్తగా దాచుకుంటే రెండు నెలల్లో కాంగ్రెస్ కార్యకర్తలు ఇంటికి వచ్చి హామీలను నెరవేరుస్తారని చెప్పిన మంత్రులు ఇప్పుడు ఎందుకు మాట్లాడటం లేదన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయలేక వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని ఇక కాంగ్రెస్‌కు అధికారం కల్ల అన్న విషయం కాంగ్రెస్ నాయకులందరికీ తెలుసన్నారు. దేవుళ్ల మీద ఒట్టేసి రుణమాఫీ చేస్తానన్నారని పూర్తి స్థాయి రుణమాఫీ చేయలేదని రైతు భరోసాను మూడు సీజన్లు రైతుల ఖాతాల్లో జమ చేయలేదన్నారు. మేడిగడ్డ నింపితే భద్రాచలంతో పాటు 24 ఊళ్లు కొట్టుకుపోతాయని రేవంత్‌రెడ్డి అంటున్నారని మేడిగడ్డ సామర్థ్యమెంత...? దాని ద్వారా వచ్చే వరద ఎంతో ఆయనకు తెలియదని 2022లో 25 లక్షల క్యూ సెక్యూల నీటిని భద్రాచలం ప్రజలు చూశారని ఆయన తెలిపారు. కాంగ్రెస్‌కు బిఆర్ఎస్ మీద కోపం ఉందని అందుకే తప్పుడు మాటలు మాట్లాడుతున్నారన్నారు.

**పట్టిసీమ కోసమే కాళేశ్వరాన్ని వదిలేశారు...**

గోదావరి పరివాహక ప్రాంతంలో దిగువన నీటి లభ్యత లేదని కాళేశ్వరం ప్రాజెక్టులో నీటిని నిల్వ చేసి తెలంగాణకు సాగునీటిని అందిస్తే పట్టిసీమకు నీరు అందదని అందుకే గురు దక్షణగా కాళేశ్వరాన్ని రేవంత్ వదిలేశారని అజయ్‌కుమార్ తెలిపారు. కాళేశ్వరం అనేది మూడు రిజర్వాయర్లు, సబ్ స్టేషన్లు, వందల కిలో మీటర్ల కాలువలు, పలు రిజర్వాయర్ల సమహారమని కాళేశ్వరం ద్వారా నీటిని అందిస్తే బిఆర్ఎస్‌కు ప్రజల మద్దతు లభిస్తుందన్న ఏకైక కారణంతోనే నీరు ఇవ్వడం లేదన్నారు. ఉమ్మడి ఖమ్మంజిల్లాలో పెద్ద తోపులుగా చెప్పుకుంటున్న వారు ఎప్పుడైనా గోదావరి జలాల తరలింపు గురించి ఆలోచించారా అని అజయ్‌కుమార్ ప్రశ్నించారు. సీతారామ ప్రాజెక్టు పూర్తిగా కేసిఆర్ ఆలోచన మాత్రమేనని దానిపై బిఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిది వేల కోట్లు ఖర్చు చేసిందని ఆయన గుర్తు చేశారు. ఎలుక తోక అంతా కాలువ తీసి నీళ్లు నెత్తిన చల్లు కున్నారని కానీ ప్రజలు బిఆర్ఎస్ కారణంగానే వైరా ప్రాజెక్టులోకి నీళ్లు వచ్చాయని అనుకుంటున్నారని ఆయన తెలిపారు. ఎలినినో ప్రభావాన్ని తట్టుకునే విధంగా కార్యాచరణ ఈ ప్రభుత్వం వద్ద లేదని అజయ్‌కుమార్ తెలిపారు. రేవంత్‌రెడ్డికి ప్రజా ప్రయోజనాల కంటే స్వప్రయోజనాలే ముఖ్యమని ఈ రాష్ట్రం పట్ల చిత్త శుద్ధి లేని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని అజయ్‌కుమార్ తెలిపారు. మీడియా సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు ఆర్‌జెసి కృష్ణ, కర్నాటి కృష్ణ, పగడాల నాగరాజు, బచ్చు విజయ్‌కుమార్, బీరెడ్డి నాగచంద్రా రెడ్డి, మగ్బూల్, బత్తుల మురళీ, దండా జ్యోతిరెడ్డి పాల్గొన్నారు.

# సీతారామను సత్వరం పూర్తి చేయండి

**(మొదటిపేజీ తరువాయి)**

కేటాయింపు లేక నిర్మాణంలో తీవ్ర జాప్యం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాక ముందు బిఆర్ఎస్ తొమ్మిదివేల కోట్లు ఖర్చు చేసిందని కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిధుల కేటాయింపు సరైన రీతిలో లేకపోవడంతో ప్రాజెక్టు అంచనా వ్యయం పెరుగుతూ వచ్చిందన్నారు. ఎలినినో ప్రభావం కృష్ణా పరివాహక ప్రాంతాల్లో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల రీత్యా సీతారామ సత్వర నిర్మాణానికి సరిపడ నిధులు కేటాయించాలని వినతి పత్రంలో కోరారు. ఖమ్మం మినహా అన్ని ఉమ్మడిజిల్లాల్లో యూనివర్సిటీలు ఉన్నాయని ఖమ్మంలో యూనివర్సిటీని స్థాపించాలని జిల్లాలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను నెలకొల్పాలని సంక్షోభంలో కూరుకుపోతున్న గ్రానైట్ పరిశ్రమను ఆదుకోవాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షన్నర మంది ఆధారపడిన గ్రానైట్ పరిశ్రమకు చేయూతనివ్వాలని వినతి పత్రంలో కోరారు. ఖమ్మంజిల్లాలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు నెలకొల్పాలని కోరారు. ఖమ్మం నగరం ఇటీవల కాలంలో బాగా విస్తరించిందని ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతుందని ఫ్లైఓవర్ల నిర్మాణానికి తగు చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. వినతి పత్రం సమర్పించిన వారిలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొండపర్తి గోవిందరావు, జిల్లా కౌన్సిల్ సభ్యులు దూసరి గోపాలరావు ఉన్నారు.

# అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి

**- ఏపిఓ జనరల్ డేవిడ్‌రాజు**



**ప్రజాపక్షం/భద్రాచలం :** గిరిజన యువతీ యువకులు వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఐటిడిఏ ఏపిఓ జనరల్ డేవిడ్ రాజు సూచించారు. వైటిసిలో నిరుద్యోగ యువతీ యువకులకు అందిస్తున్న శిక్షణను పరిశీలించిన ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా డేవిడ్ మాట్లాడుతూ ఆదివాసీ గిరిజన గ్రామాల్లో నివశిస్తున్న నిరుద్యోగ గిరిజన యువతీ యువకులు ప్రైవేటు రంగాల్లో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఐటిడిఏ ప్రాంగణంలో వైటిసి ద్వారా పలు రకాల శిక్షణలు అందిస్తున్నట్లు తెలిపాఉర. ఈ సారి బాగా గుర్తింపు పొందిన సంస్థలైన ఐటి హెల్త్ డెస్క్, అంటెండెంట్ కోర్స్ గుర్తింపు పొందిన సంస్థల ద్వారా శిక్షణలు ఇప్పిస్తున్నందున యువతీ యువకులు ఈ మూడు నెలల శిక్షణను సద్వినియోగం చేసుకుని ఉపాధిఅవకాశాలు కల్పించుకోవాలన్నారు. సిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. అనంతరం శిక్షకులకు సరఫరా చేసిన నిత్యవసరాలను పరిశీలించి వారితో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో వైటిసి సెంటర్ ఇంచార్జ్ శ్రీనివాస్, గిరిజన యువతీ యువకులు పాల్గొన్నారు.

# సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** ఎర్రుపాలెం మండలం జమలాపురం గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో దాతల సహకారంతో ప్రతిరోజూ అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు బొబ్బా కృష్ణ ప్రసాద్, ఎల్వి నారాయణరెడ్డి తెలిపారు. దాతలు ముందుకు వచ్చి సహకరిస్తే ప్రతిరోజూ వారి పేరు మీద భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు కొడాలి విజయలక్ష్మి దేవి, ఉపాధ్యక్షులు గిరిజా లక్ష్మి , యిమ్మిడి ఈశ్వర్‌చంద్ర, విద్యాసాగర్, సహాయ కార్యదర్శి చింతా కిషోర్, కోశాధికారి వీరమాచనేని వెంకటకృష్ణ, కాకుమాను లీలా కృష్ణ, అల్లూరి విష్ణుమూర్తి, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

# గోదావరి జలాలు రాకతో ప్రత్యేక పూజలు



**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరులోని కప్పల బంధం వద్ద ఎన్ఎస్పి రెగ్యులేటర్ వద్ద రైతులు ప్రజలు శనివారం గోదావరి జలాలు రాకతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మున్సిపాలిటీ చైర్మన్ మోహన్ నాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ భాగం నీరజాదేవి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పసుమర్తి చందర్రావు, రైతు సంఘం నాయకులు జాస్తి శ్రీనివాసరావు, చిత్తలూరి నరేష్ లు మాట్లాడుతూ గోదావరి జలాలు విడుదల పట్ల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు,భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరావులు సముద్రంలో కలిసే నీటిని వ్యవసాయానికి సాగు చేసుకునేందుకు విడుదల చేయటం పట్ల రైతులు ప్రజలు వారికి ప్రత్యేక ధన్యవాదములు తెలుపుతూ హర్షిస్తున్నారు. ఇప్పుడు ఉన్న పరిస్థితుల్లో నీటిని విడుదల చేసి ఖరీఫ్ కష్ట కాలంలో నీటిని పంటలకు అందించడం పట్ల వారికి రుణపడి ఉంటారని పేర్కొన్నారు. వారికి ఎల్లవేళలా రుణపడి ఉంటామని వివరించారు. ఖరీఫ్ కాలంలో వరి ఆరుతడి పంటలకు ఈ విధంగా అందించడం పట్ల రైతుల్లో వర్షం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఎస్ కే ఉస్మాన్, కౌన్సిలర్లు బీరవల్లి మాధవ్, బుక్క ర్యాంబాయి, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, ఎన్ఎస్పి అధికారులు తదితరులు ఈ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

# మహిళలు ఆర్థికంగా ఎదగాలి

**-శ్రీ సిటీ ఛైర్మన్ వెంకట్రావు**
**-మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ**





**ప్రజాపక్షం/ ఖమ్మం :** మహిళలు ఆర్థికంగా ఎదగాలని మహిళల ఆర్థిక ఎదుగుదల సమాజ ఎదుగుదలకు ఎంతో దోహదపడుతుందని శ్రీసిటీ ఛైర్మన్ గరికపాటి వెంకట్రావు తెలిపారు. మాతృశ్రీ సంస్థ ఆధ్వర్యంలో శ్రీసిటీలో కుట్టు మిషన్ శిక్షణ పొందిన మహిళలకు శనివారం ఉచితంగా కుట్టు మిషన్లు అందజేశారు. గతంలోనూ కుట్లు, అల్లికలు నేర్చుకున్న మహిళలకు శ్రీసిటీ ఛైర్మన్‌గా సొంత నిధులతో కుట్టు మిషన్లు అందజేసిన విషయం విధితమే. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ మహిళలు కేవలం మిషన్ నేర్చుకోవడానికి పరిమితం కాకుండా ఇప్పుడు ఉన్న అవకాశాలను అందిపుచ్చుకుని వ్యాపారపరమైన ఆలోచనలు చేయాలన్నారు. వివిధ సంస్థల నుంచి ఆర్డర్లు పొంది తద్వారా జీవనోపాధికి మార్గాన్ని ఏర్పరచుకోవాలని వెంకట్రావు సూచించారు. నేడు ఉన్న సమాజంలో మహిళలకు సైతం పలు అవకాశాలు వస్తున్నాయని వాటిని అందిపుచ్చుకున్న వారు ముందు వరుసలో ఉన్నారని ఆయన తెలిపారు. శ్రీసిటీ అనేది రాష్ట్రంలోనే ఒక ల్యాండ్ మార్క్ కానుందని దానికి అందరూ సహకరించాలన్నారు. కేవలం నివాస పరంగానే కాకుండా ఆరోగ్యపరంగా కూడా అన్ని వసతులు ఉన్నటువంటి ప్రాంతంగా తీర్చిదిద్దనున్నామని వెంకట్రావు తెలిపారు. ఇప్పటికే విద్య పరంగా చేయూతనిచ్చామని రానున్న కాలంలో మరిన్ని కార్యక్రమాలతో శ్రీసిటీని ఒక మోడల్ కాలనీగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయ్‌రెడ్డి, రమేష్, మాజీ సర్పంచ్ పాండు పాల్గొన్నారు.

# 17న ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా మహాసభ

**ప్రజాపక్షం/ ఖమ్మం :** తెలంగాణ ఆటో, ప్రైవేట్ మోటార్ డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి అనుబంధం) జిల్లా మహాసభ ఈనెల 17న ఖమ్మంలోని ఎంబి ఫంక్షన్ హాల్‌లో జరుగుతుందని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎండి జాకీర్, పేరబోయిన మోహన్‌రావు లు తెలిపారు. ఆటో బోర్డు ఏర్పాటు చేసి రవాణా రంగ కార్మికుల సంక్షేమం కోసం సంక్షేమ పథకాలను అమలు చేయాలని ఆటో డ్రైవర్ల ఉపాధి కోసం ప్రభుత్వం నెలకు ఐదువేల ఆర్థిక భృతి చెల్లించాలని ఏఐటియుసి డిమాండ్ చేస్తుందని వారు తెలిపారు. ఆటో డ్రైవర్లపై ఫిట్‌నెస్ ఫీజులు, లేట్ ఫీజుల భారాన్ని తగ్గించాలని గ్రీన్ ట్యాక్స్, భారీ చలానాలకు సంబంధించి పునః సమీక్షించాలనే డిమాండ్‌తో పాటు ఆరోగ్య బీమా అమలు చేయాలని, యాప్ ఆధారిత రవాణా సంస్థలను నిషేధించాలని, సబ్సిడీపై ఆటోలను అందజేయాలని డిమాండ్ చేస్తూ ఈ మహాసభ జరుగుతుందన్నారు. ఈ మహాసభకు ముఖ్య అతిథిగా కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు, మోటార్ డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కంచర్ల జమలయ్య, బి. వెంకటేషం, ఏఐటియుసి నాయకులు శింగు నర్సింహారావు, బిజి క్లెమెంట్, తోట రామాంజనేయులు, గాదె లక్ష్మి నారాయణ, రావి శివరామకృష్ణ తదితరులు పాల్గొంటారని ఎండి జాకీర్, పేరబోయిన మోహన్‌రావు లు తెలిపారు.

# 90 మంది విద్యార్థులకు రూ.13లక్షలు స్కాలర్‌షిప్ అందజేత




**ప్రజాపక్షం/ముదిగొండ:** మండల పరిధిలోని బాణాపురం గ్రామంలోని బాణా డెవలప్‌మెంట్ ఫంక్షన్‌హాల్‌లో ఆవుల భాస్కర్ రెడ్డి అధ్యక్షతన శనివారం నిర్వహించిన 'ఆవుల అమ్మిరెడ్డి స్కాలర్ షిప్' కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ మారోజు రమేశ్ ముఖ్య వక్తగా పాల్గొని విద్యార్థులకు ప్రేరణాత్మక సందేశం అందించారు. ఈ సందర్భంగా వారు స్కాలర్‌షిప్ పథకం వివరాలను నిర్వాహకులు వెల్లడించారు. 202021 విద్యా సంవత్సరం నుంచి ముదిగొండ మండలంలోని 15పాఠశాలల్లో పదోతరగతిలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు రూ.10వేలు చొప్పున ప్రోత్సాహక నగదు అందజేస్తున్నట్లు తెలిపారు. ఇంటర్ విద్యను అభ్యసించే రెండు సంవత్సరాలకు రూ.10వేలు, డిగ్రీ లేదా ఇంజినీరింగ్ చదివే విద్యార్థులకు రూ.15వేలు చొప్పున ఆర్థికసాయం అందిస్తున్నట్లు తెలిపారు. 202021 నుంచి 2025 26 వరకు మొత్తం 90మంది విద్యార్థులకు సుమారు రూ.13లక్షలు స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్నట్లు తెలిపారు. స్కాలర్‌షిప్ పొందిన ప్రతీ విద్యార్థి ఉన్నత స్థాయికి చేరుకోవడమే కాకుండా భవిష్యత్‌లో మరెందరో విద్యార్థులకు స్ఫూర్తిగా నిలవాలని కోరారు. భోజన విరామం అనంతరం 90మంది స్కాలర్లతో ఆవుల భాస్కర్‌రెడ్డి ముఖాముఖి నిర్వహించి, వారి ఆలోచనలు, ఆశయాలు, లక్ష్యాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి సంధ్య నాయక్, ఉప సర్పంచి లక్ష్మీ నారాయణ, ఉన్నం పూర్ణచంద్రరావు, లక్ష్మీ రెడ్డి, వట్టికూటి వెంకటేశ్వర్లు, పాలువాయి పాండురంగారావు, పంద్రాకోలా రాంబాబు, బాణా ఫౌండేషన్ మేనేజర్ మాచర్ల వెంకట్, ట్రెజరర్ గుండు వెంకటేశ్వర్లు, ఆత్మకూరి శేషగిరిరావు, ఆవుల వరదారెడ్డి, పవన్ కుమార్ రెడ్డి, జయపాల్ రెడ్డి, గ్రామపెద్దలు, మండలంలోని 15 ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులు విలువలతో కూడిన విద్యనందించాలి

**ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి దయానంద్**



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ఉపాధ్యాయులతో విలువలతో కూడిన విద్యను అందించటంతో పాటు, విద్యార్థుల్లో జ్ఞానంతో పాటు నైతిక విలువలు, క్రమశిక్షణ, దేశభక్తిని పెంపొందించే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. శనివారం పట్టణంలోని మాధురి ఫంక్షన్ హాల్‌లో శనివారం రామకృష్ణ వివేకానంద భావ ప్రచార పరిషత్ తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపాధ్యాయ సదస్సు ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి సత్తుపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. స్వామి వివేకానంద బోధనలు నేటి సమాజానికి ఎంతో అవసరమని, ఉపాధ్యాయులు వాటిని విద్యార్థులకు చేరవేయాలని సూచించారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని ఆమె పేర్కొన్నారు.కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా రామకృష్ణ మఠం అధ్యక్షులు స్వామి బోధమయానంద మహారాజ్, ఆర్‌ఐఎంఎస్‌ఈ కరస్పాండెంట్ స్వామి ఆనంద మహారాజ్, రామకృష్ణ మిషన్ ఉప కార్యదర్శి స్వామి సితికంటానంద మహారాజ్ హాజరై ఉపాధ్యాయుల బాధ్యతలు, విలువలతో కూడిన విద్య, వ్యక్తిత్వ వికాసంపై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మున్సిపల్ ఛైర్మన్ రోహన బేగం కమల్ పాషా, సత్తుపల్లి ఎంఈవో రాజేశ్వరరావు, ఏఎంసీ ఛైర్మన్ దోమ ఆనంద్, కార్యక్రమ నిర్వాహకులు, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య ప్రతినిధులు, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యావేత్తలు, ప్రముఖులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఏఐటియూసి పోరాట ఫలితమే తాడిచర్ల-2 కేటాయింపు

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** తాడిచర్ల2 బొగ్గు బ్లాక్‌ను సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేస్తూ తొలి ఉద్యమానికి శ్రీకారం చుట్టింది ఏఐటియూసి నేనని, ఏఐటీయూసీ పోరాట ఫలితంతోనే సింగరేణి కి తాడిచర్ల2 కేటాయించడం జరిగిందని ఏఐటీయూసీ సత్తుపల్లి కార్యదర్శి సముద్రాల సుధాకర్ అన్నారు. 2013 లోనే తాడిచర్ల2 బొగ్గు బ్లాక్‌ను సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేస్తూ సచివాలయాన్ని ముట్టడించి అరెస్టులకు గురైన ఘనత ఏఐటియుసి నాయకులదేనని శనివారం విడుధల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే 2017 మే 12 నుంచి 18 వరకు సింగరేణి జాతా పేరుతో తాడిచర్ల2 ప్రాజెక్టును సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేస్తూ బస్సు యాత్ర నిర్వహించిన ఏకైక కార్మిక సంఘం ఎఐటియుసి మాత్రమేనని తెలిపారు. కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే మిగిలిన బొగ్గు బ్లాకులను కూడా సింగరేణికి కేటాయించి సంస్థ మనుగడను కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా,లిక్కర్ స్కామ్ కేసులో బెయిల్‌పై విడుదలైన కవిత ప్రస్తుతం బాయి బాట పేరుతో కార్మికుల ముందుకు వచ్చి మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. శనివారం సత్తుపల్లి పర్యటనకు వచ్చిన ఆమెకు కార్మికుల నుంచి పెద్దగా స్పందన లభించలేదని పేర్కొన్నారు. కార్మికులు అన్ని పరిణామాలను గమనిస్తున్నారని సముద్రాల సుధాకర్ తెలిపారు.

# ప్రపంచ జనాభా, నులిపురుగుల నివారణ దినోత్సవాలను విజయవంతం చేయండి

**-జిల్లా వైద్యాధికారి డాక్టర్ డి రామారావు**



**ప్రజాపక్షం/ఖమ్మం వైద్యవిభాగంః** ప్రపంచ జనాభా దినోత్సవం, జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి రామారావు పిలుపునిచ్చారు. శనివారం ఖమ్మం పట్టణంలోని కొత్తూరు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించిన ఆయన విద్యార్థినులు, ఉపాధ్యాయులు సిబ్బందికి ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. జనాభా నియంత్రణ, తల్లిశిశు ఆరోగ్యం, బాలికల ఆరోగ్య సంరక్షణపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సూచించిన ఆయన, ఈ నెల 13న నిర్వహించే జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా అర్హులైన విద్యార్థులందరూ తప్పనసరిగా ఆల్బెండజోల్ మాత్రలు తీసుకోవాలని చెప్పారు. ఈ మాత్రల వల్ల నులిపురుగుల కారణంగా వచ్చే రక్తహీనత, పోషకాహారలోపం, ఎదుగుదల సమస్యలను నివారించవచ్చని వివరించారు. వర్షాకాలం నేపథ్యంలో డెంగ్యూ వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ రామారావు సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటిస్తూ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, జ్వరం వచ్చిన వెంటనే స్వీయ వైద్యం చేయకుండా ప్రభుత్వ ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాల వంటగదిని పరిశీలించిన ఆయన ఆహార నాణ్యత పరిశుభ్రత తాగునీటి సదుపాయాలను తనిఖీ చేసి, విద్యార్థినులకు పోషకాహారం అందించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. అలాగే హెచ్‌పివి టీకా ప్రాముఖ్యతను వివరిస్తూ బాలికలు తప్పనిసరిగా టీకా తీసుకోవాలని, గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ నివారణలో ఇది కీలకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ మహేందర్‌రెడ్డి, హెచ్‌ఈఓ భద్రు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గురుకుల కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ప్రాంతీయ అధికారిని





**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరులోని గురుకుల కళాశాలలో శనివారం ప్రాంతీయ అధికారిని అపర్ణ గురుకుల కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని పరిసరాలు, భోజన శాల, వంటగది, రికార్డులు, పాఠశాల గదులను, మరుగుదొడ్లు పూర్తిస్థాయిలో పరిశీలించారు. రెండో శనివారం కావడంతో విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేశారు. విద్యార్థినిలను తల్లిదండ్రులు గైర్హాజరు కాకుండా చూసుకోవాలని కోరారు. కోతుల బెడద కారణంగా పిల్లలు ఇబ్బంది పడుతున్నారని తల్లిదండ్రులు అధికారిని దృష్టికి తీసుకెళ్లారు. ప్రతి ఉపాధ్యాయులు విద్యార్థుల ఉత్తమ విద్య కోసం కృషి చేయాలని ఉత్తమ ఫలితాలే ప్రధాన దృష్టిగా పనిచేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కనకదుర్గ, పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఓటు హక్కు పరిరక్షణకు ప్రతి ఓటరు బాధ్యతగా వ్యవహరించాలి

**-మాజీ ఎంఎల్‌ఏ హరిప్రియ నాయక్**



**ప్రజాపక్షం/ఇల్లందు:** ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్)కార్యక్రమంలో భాగంగా ఇల్లందు మాజీ ఎంఎల్ఏ, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బానోత్ హరిప్రియ నాయక్ తన స్వగృహంలో ఎస్ఐఆర్ నమోదు ఫారాన్ని పూర్తి చేసి స్థానిక బీఎల్‌ఓకు అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇల్లందు నియోజకవర్గంలోని ప్రతి ఓటరు ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన పెంచుకుని, తమ సందేహాలను నివృత్తి చేసుకుని కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. ప్రతి ఓటరు స్థానిక బీఎల్‌ఓలకు సహకరించి సరైన సమాచారాన్ని అందజేసి తమ ఓటు హక్కును కాపాడుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, దాన్ని పరిరక్షించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. 2002కు ముందు, తర్వాత ఓటు హక్కు పొందిన వారందరూ ఎస్ఐఆర్ ప్రక్రియను బాధ్యతగా పూర్తి చేయాలని పిలుపునిచ్చారు.

## భూక్యా మదన్ సింగ్‌కు నివాళి



**ప్రజాపక్షం/సుజాతనగర్‌:** సుజాతనగర్ మండలం లోని సీతంపేట బంజారా సీపీఐ సీనియర్ నాయకులు, జిల్లా రైతు సంఘం కార్యవర్గ సభ్యులు, సుజాతనగర్ మండల రైతు సంఘం అధ్యక్షులు భూక్య మదన్ సింగ్ శుక్రవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మరణించడం జరిగింది. విషయం తెలుసుకున్న సిపిఐ నాయకులు వారి స్వగృహానికి చేరుకొని పూలమాలవేసి, నివాళులర్పించి, వారి భౌతిక కాయానికి ఎర్రజెండా కప్పి విప్లవ జోహార్లు తెలియజేసి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా సాబీర్ పాషా మాట్లాడుతూ మదన్ సింగ్ ఈ ప్రాంతంలో సిపిఐ పార్టీ అభివృద్ధి కోసం రైతాంగ సమస్యల పైన అనేక పోరాటాలు చేశారన్నారు సిపిఐ పార్టీ ఒక గొప్ప నాయకుడిని కోల్పోవడం బాధాకరమన్నారు. వారి కుటుంబానికి భారత కమ్యూనిస్టు పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సుజాతనగర్ మండల కార్యదర్శి కోమారి హనుమంతరావు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భూక్య దశ్రు, సీపీఐ జిల్లా సమితి సభ్యులు జక్కుల రాములు, జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షులు తాళ్లూరి పాపారావు, తాళ్లూరి ధర్మారావు, సీపీఐ జిల్లా సమితి సభ్యులు తాళ్ల వెంకటేశ్వరరావు, సీపీఐ మండల నాయకులు లావుడ్యా గోపి చౌహన్ , సీపీఐ మండల నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహావిష్కరణకు విజయవంతం చేయండి



**ప్రజాపక్షం/సుజాతనగర్‌:** ఈనెల 18న రాఘవాపురం గ్రామంలో జరగనున్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ మహోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరుతూ విగ్రహ ఏర్పాటు కమిటీ ఆధ్వర్యంలో ప్రచార కరపత్రాన్ని గ్రామ సర్పంచ్ గరిక వెంకట సాంబయ్యతో పాటు గ్రామంలోని అన్ని వర్గాల ప్రముఖులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు శనివారం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ అంబేద్కర్ వాది వేల్పుల భాస్కర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు లోశెట్టి నాగార్జున, కలవాల నాగయ్య, పెంటి వెంకటేశ్వర్లు ,సిపిఐ నాయకులు ఆకుల వెంకన్న, సిపిఎం నాయకులు మద్దె బోయిన గోవర్ధన్ ,జలగం యువసేన నాయకులు దొంచరపు శ్రీనివాస్, తెల్లబోయిన కవీన్, గుండేటి వెంకట రాములు, మురిపిటి రాములు, గుండేటి గోపయ్య, మురిపిటి మాధవరావు, కేసు పాక వెంకటేశ్వర్లు ,గుండేటి రాములు, మురిపిటి నాగేష్, మురిపిటి గణేష్, గుండేటి బాలకృష్ణ, గుండేటి నాగరాజు, కాకటి నరసింహారావు, గుండేటి దుర్గారావు, మురిపిటి నాగరాజు, తాళ్లూరి స్వామి దాసు, గ్రామ పెద్దలు, విగ్రహ ఏర్పాటు కమిటీ సభ్యులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి



**ప్రజాపక్షం/సుజాతనగర్‌:** సుజాతనగర్ సీతంపేట బంజర గ్రామానికి చెందిన భూక్య మదన్ సింగ్ (54) శుక్రవారం సాయంత్రం రుద్రంపూర్ గ్రామంలోని తన పనులను ముగించుకుని, రుద్రంపూర్ లోని తన చెల్లి గుగులోత్ షీలా వాళ్ళ ఇంటికి వెళ్లి తన మోటార్ సైకిల్ పై తిరిగి ఇంటికి బయలుదేరారు. రాత్రి సుమారు 8:30 గంటల సమయంలో నిమ్మలగూడెం కాలనీ దాటిన తర్వాత, కొత్తగా నిర్మిస్తున్న రైస్ మిల్ వద్ద బిటి రోడ్డుపై ఉన్న ఒక గుంటను గమనించకపోవడంతో బైక్ అదుపు తప్పి రోడ్డుపై పడిపోయారు. ఈ ప్రమాదంలో ఆయన తలకు తీవ్ర గాయాలై స్పృహ కోల్పోయారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో కుటుంబ సభ్యులు వెంటనే ఆయనను చికిత్స నిమిత్తం కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు మదన్ సింగ్ శుక్రవారం రాత్రి 10:09 గంటల సమయంలో మృతి చెందినట్లు ధృవీకరించారు. మృతుడి కొడుకు భూక్య శ్రీనాథ్ సింగ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని సుజాతనగర్ ఎస్ఐ మాలోత్ రమాదేవి దర్యాప్తు చేస్తున్నారు.

## బాలల సమస్యలపై స్పందిస్తున్న చిల్డ్రన్స్ పార్లమెంట్



**ప్రజాపక్షం/ములకలపల్లి:** ములకలపల్లి గుడ్ షెఫర్డ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన చిల్డ్రన్స్ పార్లమెంట్ సభ్యుల వార్షిక సమావేశం ఘనంగా జరిగింది. ఈ సమావేశంలో పొగలపల్లి, తిమ్మంపేట, చోటిగూడెం, కంపగూడెం, ములకలపల్లి, మాదా రం, మొగరాలగుప్ప, మోటుగూడెం, గొల్లగూడెం గ్రామాలకు చెందిన చిల్డ్రన్సష్ పార్లమెంట్ సభ్యులు పాల్గొన్నారు. ఈసందర్భంగా బాల సభ మంత్రులు మాట్లాడుతూ గ్రామాల్లో తాము గుర్తించిన సమస్యలను గ్రామ సభల ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. తమకు సహకరించిన సర్పంచులు, పంచాయితీ కార్యదర్శులకు కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచులు చంద్రలేఖ, రవి, ఆదిలక్ష్మి , సుజాత మాట్లాడుతూ చిన్నతనం నుంచే క్రమశిక్షణ, సామాజిక బాధ్యతతో ముందుకు సాగుతూ గ్రామ సమస్యలను గుర్తించి పరిష్కారానికి కృషి చేస్తున్న విద్యార్థులను అభినందించారు. ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని సాధన దిశగా పయనించాలని సూచించారు. పాఠశాలల్లో జరిగే పేరెంట్, టీచర్ సమావేశాలకు తల్లిదండ్రులను కూడా భాగస్వామ్యం చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణ, తిమ్మంపేట హెచ్ఎం శంకర్, సిస్టర్స్ ఉదయ, రీమా, తదితరులు పాల్గొన్నారు.

# నాటుకోడి పెంపకమే నేటి లాభసాటి ఉపాధి..!

**- తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం**
**- గ్రామీణ కుటుంబాలకు ఆర్థిక భరోసా**
**- ఆరోగ్యకరమైన గుడ్లు, మాంసానికి పెరుగుతున్న డిమాండ్**
**- రైతుల చూపు నాటు కోడి పెంపకంపైనే..**





**ప్రజాపక్షం/తల్లాడ:** గ్రామీణ ప్రాంతాల్లో నాటుకోడి పెంపకం రైతులు, మహిళా సంఘాలు, నిరుద్యోగ యువతకు లాభదాయకమైన ఉపాధి మార్గంగా మారుతోంది. తక్కువ పెట్టుబడితో ప్రారంభించగల ఈ పరిశ్రమ ద్వారా కుటుంబ అవసరాలు తీర్చుకోవడంతో పాటు అదనపు ఆదాయాన్ని కూడా సంపాదించే అవకాశం ఉంది. ఆరోగ్యంపై ప్రజల్లో పెరుగుతున్న అవగాహనతో నాటుకోడి గుడ్లు, మాంసానికి మార్కెట్‌లో డిమాండ్ రోజురోజుకూ పెరుగుతోంది. పెరట్లోనే కొద్దిపాటి స్థలంలో నాటుకోళ్లను పెంచుకోవచ్చు. పగటిపూట మేత కోసం బయటకు వదిలి, రాత్రివేళ సురక్షితమైన షెడ్లలో ఉంచడం వల్ల నిర్వహణ ఖర్చు తగ్గుతుంది. మొక్కజొన్న, చిరుధాన్యాలు, ధాన్యపు గింజలు, ఆకుకూరలు, వంటింటి మిగులు పదార్థాలను ఆహారంగా అందించడం ద్వారా దాణా వ్యయాన్ని తగ్గించవచ్చు. నాటుకోళ్లలో వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉన్నప్పటికీ, సమయానికి టీకాలు వేయించడం, పరిశుభ్రమైన తాగునీరు అందించడం, షెడ్లను శుభ్రంగా ఉంచడం తప్పనిసరి. ముఖ్యంగా వర్షాకాలంలో తేమ పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పశువైద్య నిపుణులు సూచిస్తున్నారు. నాటుకోడి గుడ్లు సాధారణ గుడ్లతో పోల్చితే ఎక్కువ ధరకు విక్రయమవుతున్నాయి. అలాగే నాటుకోడి మాంసానికి హోటళ్లు, పట్టణ మార్కెట్లు, పండుగల సమయంలో భారీ డిమాండ్ ఉండటంతో రైతులకు మంచి ఆదాయం లభిస్తోంది. ప్రభుత్వం, పశుసంవర్ధక శాఖ అందిస్తున్న శిక్షణ కార్యక్రమాలు, సబ్సిడీ పథకాలు, రుణ సదుపాయాలను సద్వినియోగం చేసుకుంటే నాటుకోడి పెంపకాన్ని చిన్న స్థాయి నుంచి వాణిజ్య స్థాయికి విస్తరించే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. వ్యవసాయంతోపాటు అదనపు ఆదాయం పొందాలనుకునే రైతులకు నాటుకోడి పెంపకం ఒక ఉత్తమ ప్రత్యామ్నాయంగా నిలుస్తోంది. శాస్త్రీయ పద్ధతులను పాటిస్తూ సరైన నిర్వహణ చేపడితే ఈ రంగం గ్రామీణ ఆర్థికాబివృద్ధికి బలమైన ఆధారంగా మారనుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# అటవీశాఖ కార్పొరేషన్ ప్లవింగ్‌లో కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం..!

**-నాణ్యత లేని ప్లవింగ్ అండ్ ప్లాంటింగ్**
**-కాంట్రాక్టర్లకు మద్దతు పలుకుతున్న అధికారగణం**







**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** అటవీ సంపదను పెంచడంలో కీలక పాత్ర పోషించాల్సిన అటవీ అభివృద్ధి సంస్థ(టిఎస్ఎఫ్డిసి)కార్పొరేషన్ విభాగంలో నిబంధనలు తుంగలో తొక్కి, అన్నపురెడ్డిపల్లి ఏజెన్సీ పరిధిలోని అబ్బుగూడెం అటవ ప్లాంటేషన్లలో భూమి దున్నకం(ప్లవింగ్) పనుల్లో కాంట్రాక్టర్ ఇష్టారీతని ప్లయింగ్ కొనసాగిస్తున్నాడని, కొత్తగా మొక్కలు నాటేందుకు భూమిని సిద్ధం చేసే ప్రక్రియలో ప్రభుత్వ నిబంధనలను కాంట్రాక్టర్లు యథేచ్ఛగా ఉల్లంఘిస్తుండగా, సంబంధిత కార్పొరేషన్ అధికారుల అండదండలతో వారు ఇష్టారాజ్యంగా ప్లవింగ్ చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. జీవోను అపహాస్యంగా చేస్తున్న కాంట్రాక్టర్లు, అటవీ భూములు గట్టిగా, పాత చెట్ల వేర్లతో నిండిచ ఉంటాయనే ఉద్దేశంతో నేలను లోతుగా, నాణ్యతంగా దున్నేందుకు కచ్చితంగా 50హెచ్‌పీ(హార్స్ పవర్)లేదా అంతకంటే ఎక్కువ సామర్థ్యం ఉన్న భారీ ట్రాక్టర్ ఇంజన్లను మాత్రమే ఉపయోగించాలని ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలతో జీవో జారీ చేసింది. టెండర్ నిబంధనలలో కూడా ఈ విషయాన్ని స్పష్టంగా పొందుపరిచారు. అయితే అన్నపురెడ్డిపల్లి ఏజెన్సీ ప్రాంతంలో టెండర్లు దక్కించుకున్న కొందరు కాంట్రాక్టర్లు డీజిల్ ఖర్చులు మిగుల్చుకోవడానికి, తక్కువ మెయింటెనెన్స్‌తో, లాభాల కక్కుర్తితో నిబంధనలకు విరుద్ధంగా తక్కువ హెచ్‌పీ 42 కంటే తక్కువ కలిగిన సాధారణ వ్యవసాయ ట్రాక్టర్లతో అటవీ భూములను దున్నిస్తున్నారు.

**అధికారుల సమర్ధన వెనుక మతలబు ఏమిటి?**

సాధారణంగా నిబంధనలు ఉల్లంఘిస్తే సదరు కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాల్సిన కార్పొరేషన్ అధికారులు, ఇక్కడ మాత్రం రివర్స్ గేర్ వేశారు. తక్కువ సామర్థ్యం ఉన్న ట్రాక్టర్లతో దున్నకం సాగిస్తున్నా, పనులు బాగానే జరుగుతున్నాయి అంటూ అవి తక్కువ హెచ్పి ట్రాక్టర్లు అని అనుకోలేదంటూ కాంట్రాక్టర్లను వెనుకేసుకు రావడంతో ముడుపులు వారికి అందాయనే ఆరోపణలు సైతం బలంగా వినిపిస్తున్నాయి. తక్కువ హెచ్‌పీ ట్రాక్టర్లతో దున్నడం వల్ల నేలపై పైన మాత్రమే నలుగుతుందని, లోతుగా దున్నకపోవడం వల్ల వర్షపు నీరు భూమిలోకి ఇంకక, రేపు నాటబోయే కొత్త మొక్కల వేర్లు లోపలికి వెళ్లక మొక్కలు చనిపోయే ప్రమాదం ఉంటుంది. ప్రభుత్వం ఎక్కువ సామర్థ్యం గల ట్రాక్టర్ల రేట్ల ప్రకారం హెక్టార్లకు వేలాది రూపాయల ప్రజాధనాన్ని బిల్లుల రూపంలో చెల్లిస్తుంటే, క్షేత్రస్థాయిలో మాత్రం తక్కువ సామర్థ్యం ఉన్న వాహనాలతో మమ అనిపిస్తున్నారు. అధికారుల ఉదాసీనత లేదా కాంట్రాక్టర్లతో ఉన్న కలిసికట్టు ఒప్పందాల వల్లే ఈ అక్రమాలు బహిరంగంగా సాగుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**ఉన్నతాధికారులు స్పందించాలి...!**

అన్నపురెడ్డిపల్లి ఏజెన్సీ ప్రాంతంలో ప్రభుత్వ జీవోను ఉల్లంఘించి జరుగుతున్న ఈ ప్లవింగ్ పనులపై, స్థానికులు మంగళవారం వెళ్లి నాణ్యత లేని ప్లవింగ్ పనులు నిలిపివేయాలంటూ అడ్డుకోవడం గమనార్హం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తక్షణమే క్షేత్రస్థాయి పరిశీలన జరిపి తక్కువ హెచ్‌పీ ట్రాక్టర్లతో దున్నిన పనులను, వాటి బిల్లులను నిలిపివేసి, నిబంధనల ప్రకారం తగిన సామర్థ్యం కలిగిన ట్రాక్టర్లను వాడేలా చూడాలని, అవినీతికి తావిస్తున్న స్థానిక కార్పొరేషన్ అధికారులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**ఈవిషయంపై డిపిఎం నాగలక్ష్మీ వివరణ.....!**

ఈవిషయమై స్థానిక డిఎంపి నాగలక్ష్మీ ని వివరణ కోరగా మేము అబ్బుగూడెం కార్పొరేషన్ ప్లాంటేషన్‌లో ప్లవింగ్ చేపిస్తున్నామని, దానిలో ఒక ట్రాక్టర్ తక్కువ సామర్థ్యం కల ట్రాక్టర్ అని మాకు తెలియదని, తక్షణమే ఆ ట్రాక్టర్‌ను నిలిపి వేస్తున్నామని వారు చెప్పడం కొసమెరుపు.

# చేతి పంపుల మరమ్మతులతో తీరిన తాగునీటి సమస్య



**ప్రజాపక్షం/కారేపల్లి:** సింగరేణి మండలం అప్పాయిగూడెం గ్రామ పంచాయితీ పరిధిలోని అప్పాయిగూడెం, తులిస్యతండా, భిక్యతండా గ్రామాల్లో హ్యాండ్ పంపులకు ఫ్లస్సింగ్ నిర్వహించి, పూర్తి స్థాయి మరమ్మతులు చేపట్టారు. దీర్ఘకాలంగా నెలకొన్న మంచినీటి సమస్యకు పరిష్కారంగా చేపట్టిన ఈ పనులతో గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటి అందుబాటులోకి వచ్చింది. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ గ్రామ పంచాయితీ పాలకవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ దండు ప్రవీణ్, ఉప సర్పంచ్ ఎట్టి సంధ్యారాణి, వార్డు సభ్యులు జార్పుల శాలి, వాంకుడోత్ రమేష్, అజ్మీరా మమత, మాలోత్ విజయ, బోర్ మెకానిక్ మోహన్‌రావు, గ్రామ పంచాయితీ సిబ్బంది, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

# గిరిజన విద్యార్థుల జీవితాలతో చెలగాటం..!

**-పోషకాహారం, వైద్య సేవల కొరతపై తీవ్ర ఆరోపణలు**
**- అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు**
**-ఐటిడిఏ పివో వెంటనే తనిఖీ చేయాలని**
**గిరిజన సంఘాల డిమాండ్**





**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలోని ఏజెన్సీ ప్రాంతం కావడిగుండ్ల గ్రామంలో ఉన్న గిరిజన ఆశ్రమ పాఠశాల పరిస్థితి రోజురోజుకూ ఆందోళనకరంగా మారుతోందని స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు వసతి, పోషకాహారం, ఆరోగ్య సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఆశ్రమ పాఠశాలలను నిర్వహిస్తున్నప్పటికీ కావడిగుండ్ల ఆశ్రమ పాఠశాలలో మాత్రం విద్యార్థులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని వారు వాపోతున్నారు. దూర ప్రాంతాల నుంచి ఉన్నత విద్యపై ఆశతో ఆశ్రమ పాఠశాలలో చేరిన విద్యార్థులకు సరైన పోషక విలువలు కలిగిన ఆహారం అందడం లేదని, హాస్టల్ నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగా విద్యార్థుల ఆరోగ్యం దెబ్బతింటోందని ఆరోపిస్తున్నారు. హాస్టల్ పరిసరాల్లో పరిశుభ్రత లేకపోవడం వల్ల విద్యార్థులు తరచూ జ్వరాలు, ఇతర అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారు. అనారోగ్యానికి గురైన విద్యార్థులకు సకాలంలో వైద్య సేవలు అందడం లేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యాబోధన విషయంలో కూడా పరిస్థితి ఆశించిన స్థాయిలో లేదని, కొందరు ఉపాధ్యాయులు స్థానికంగా అందుబాటులో ఉండడం లేదని విద్యార్థులు సమస్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించే పరిస్థితి కనిపించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. హాస్టల్‌లో విద్యార్థుల ఆలనా పాలన, భద్రత, పరిశుభ్రత, ఆరోగ్య సంరక్షణ వంటి అంశాలపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయపడుతున్నారు. గిరిజన విద్యార్థులు ప్రభుత్వంపై నమ్మకంతో ఆశ్రమ పాఠశాలల్లో చేరితే కనీస సౌకర్యాలు కూడా అందకపోవడం బాధాకరమని గిరిజన సంఘాల నాయకులు పేర్కొంటున్నారు. నాణ్యమైన ఆహారం స్వచ్ఛమైన తాగునీరు, పరిశుభ్రమైన వసతి, మెరుగైన వైద్య సేవలు, నాణ్యమైన విద్య అందించడంలో నిర్లక్ష్యం కొనసాగితే గిరిజన విద్యార్థుల ఆరోగ్యం, భవిష్యత్ రెండు ప్రమాదంలో పడే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కావడిగుండ్ల ఆశ్రమ పాఠశాలలో నెలకొన్న పరిస్థితులపై ఐటిడిఏ పివో స్వయంగా ఆకస్మికంగా తనిఖీ నిర్వహించి వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని, లోపాలకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు తక్షణమే కల్పించాలని స్థానికులు, తల్లిదండ్రులు, గిరిజన సంఘాల ప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. గిరిజన విద్యార్థుల విద్య, ఆరోగ్యం, సంక్షేమ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా అధికారులు వెంటనే స్పందించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ట్రాక్టర్ల రాకతో కనుమరుగవుతున్న కాడెడ్లు..!

**-యాంత్రీకరణతో వ్యవసాయంలో తగ్గిన ఎద్దుల ప్రాధాన్యం**
**-కనుమరుగవుతున్న గ్రామీణ సంస్కృతి**





**ప్రజాపక్షం/వైరా:** ఒకప్పుడు వ్యసాయం అంటే కాడెద్దులు, నాగలి, ఎద్దుల బండి తప్పనిసరిగా కనిపించేవి. దుక్కి దున్నడం నుంచి విత్తనాలు వేయడం, పంటను ఇంటికి చేర్చడం వరకు ప్రతి పనిలో కాడెద్దుల పాత్ర ఎంతో కీలకంగా ఉండేది. కాని కాలానుగుణంగా వ్యవసాయంలో యాంత్రీకరణ పెరగడంతో కాడెద్దుల స్థానాన్ని ట్రాక్టర్లు, ఆధునిక వ్యవసాయ యంత్రాలు ఆక్రమించారు. దీంతో గ్రామాల్లో కాడెద్దులు కనిపించడం కూడా అరుదుగా మారింది. ఒకప్పుడు ప్రతి రైతు ఇంట్లో ఎద్దుల జంట ఉండేది. వ్యవసాయ సీజన్ ప్రారంభానికి ముందే వాటిని సిద్ధం చేసుకొని పొలం పనులు ప్రారంభించేవారు. ఎద్దులు నాగలి ఉన్న రైతులకు మంచి గిరాకి ఉండేది. దుక్కి దున్నడం, విత్తనాలు వేయడం వంటి పనుల కోసం ముందుగానే అడ్వాన్స్ ఇచ్చి తేదీలు ఖరారు చేసుకునే పరిస్థితి ఉండేది. దీంతో వ్యవసాయ కూలీలకు కూడా విస్తృతంగా ఉపాధి లభించేది. ప్రస్తుతం మార్కెట్‌లో ట్రాక్టర్లతో పాటు కల్టివేటర్, రోటావేటర్, గొర్రు, లెవలర్, సీడ్ డ్రిల్, హార్వెస్టర్, గడ్డి కట్టే యంత్రాలు వంటి అనేక ఆధునిక వ్యవసాయ పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. వీటి సహాయంతో దుక్కి దున్నడం, భూమిని చదును చేయడం, విత్తనాలు వేయడం, పంట కోయడం, గడ్డిని కట్టడం వంటి పనులన్నీ తక్కువ సమయంలో పూర్తవుతున్నాయి. దీంతో రైతులకు సమయం ఆదా కావడంతో పాటు కూలీలపై ఆధారపడాల్సిన అవసరం కూడా తగ్గుతుంది. వ్యవసాయంలో యాంత్రీకరణ వలన ఖర్చు తగ్గడం, పనులు వేగంగా పూర్తవడం వంటి ప్రయోజనాలు ఉన్నప్పటికీ కాడెద్దులు, ఎద్దుల బండ్లు క్రమంగా కనుమరుగవుతున్నాయి. రైతన్నకు ఒకప్పుడు వెన్నుదన్నుగా నిలిచిన ఈ సంప్రదాయ వ్యవసాయ సాధనాలు నేడు జ్ఞాపకాలుగా మాత్రమే మిగిలిపోతుఅన్నాయి. గ్రామీణ సంస్కృతికి ప్రతీకగా నిలిచిన కాడెద్దుల ఉనికిని కాపాడేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పలువురు రైతులు అభిప్రాయపడుతున్నారు.

# అన్నదాతకు అండగా రైతు భరోసా

**- 1.78 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.318.42 కోట్లు జమ**





**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** అన్నదాతలకు రైతు భరోసా అండగా నిలుస్తోంది. ఇప్పటి వరకు జిల్లాలో 1 లక్ష78,828 మంది మంది రైతుల ఖాతాల్లో రూ.318.42 కోట్ల నిధులను ప్రభుత్వం జమ చేసింది. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు వ్యవసాయ, రెవెన్యూ, బ్యాంకింగ్ శాఖల సమన్వయంతో పంపిణీ జరిగింది. ప్రభుత్వం వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తూ నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించడంతో పాటు రైతులకు పెట్టుపడి సాయం, వరికి రూ.500 బోనస్ అందిస్తోంది. వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది.

**రైతు భరోసా నిధులు పక్కదారి..**

ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సహాయం కోసం అందిస్తున్ననిధులు ప్రక్కదారి పడుతున్నాయి. సెర్ప్ మహిళా సంఘాల నిధులకు సంబంధించి బ్యాంకుల్లో బకాయిలు ఉండటంతో రైతు భరోసా డబ్బులు బ్యాంకుల్లో జమ కావడంతో వాటిని బ్యాంకు మేనేజర్లు ఇవ్వకుండా నిలుపుదల చేస్తున్నారు. రైతుభరోసా నిధులు ఇవ్వాలంటూ బ్యాంకు మేనేజర్లను బ్రతిమాలుతున్నా ససేమిరా అంటున్నారు. దీంతో బ్యాంకుల ముందు ఆందోళన సిద్ధమవుతున్నారు. దీనిపై కలెక్టర్ శనివారం ఓ ప్రకటన విడుదల చేస్తూ రైతుభరోసా నిధులు వేరే రుణబకాయిలు, సేవా చార్జీల పేరుతో నిలుపుదల చేయరాదని, బ్యాంకర్లకు ఆదేశాలు జారీ చేశారు. రైతుభరోసాపై ఎలాంటి అనధికారిక కోతలు విధించరాదని, ప్రభుత్వం జమచేసిన మొత్తాన్ని రైతులకు పూర్తిగా అందించాలని ఆదేశించారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియలో కాంగ్రెస్ నాయకుల భాగస్వామ్యం



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** బూర్గంపాడు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పూలపెల్లి సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు నాగినేనిప్రోలురెడ్డిపాలెం గ్రామ పంచాయితీ పరిధిలోని 216, 218, 219 బూత్‌లలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ(ఎస్ఐఆర్)కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా నాయకులు ఓటర్లకు ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన కల్పించి, ఎన్యూమరేషన్ ఫారాలను నింపించి సంబంధిత బీఎల్‌ఓలకు అందజేశారు. ఈకార్యక్రమంలో పినపాక నియోజకవర్గ సోషల్ మీడియా ఇన్‌చార్జి దునుకు రాము, యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎడమకంటి సుధాకర్‌రెడ్డి, బూర్గంపాడు యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు నిమ్మల హరీష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎడమకంటి పెద్ద రోశిరెడ్డి, ఆవుల నాగిరెడ్డి, కాటం వెంకట్రామిరెడ్డి, బోనం నాగిరెడ్డి, సారెడ్డి అశోక్‌రెడ్డి, చెంచలపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## పారదర్శకమైన ఓటరు జాబితా రూపకల్పనకు ప్రజలు సహకారం అవసరం



**ప్రజాపక్షం/దుమ్ముగూడెం:** దుమ్ముగూడెం మండలం ములకలపాడు గ్రామ పంచాయితీ పరిధిలో గల బూత్ నెంబర్ 109లో భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ(ఎస్ఐఆర్)కార్యక్రమంలో సర్పంచ్ పర్సిక తులసమ్మ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎన్యూమరేషన్ ఫారాల ధృవీకరణ, కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పులు, డూప్లికేట్ పేర్లు, మరణించిన ఓటర్ల పేర్ల తొలగింపు ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పారదర్శకమైన, తప్పులు లేని ఓటరు జాబితా రూపకల్పనకు ప్రతి ఒక్కరూ బీఎల్‌ఓలకు సరైన సమాచారం అందించి సహకరించాలని కోరారు. 18 సంవత్సరాలు నిండిన వారంతా తప్పని సరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని, ప్రజాస్వామ్య బలోపేతానికి స్వచ్ఛమైన ఓటరు జాబితా ఎంతో కీలకమని అన్నారు. ఈకార్యక్రమంలో బీఎల్‌ఓలు, గ్రామ పంచాయితీ సిబ్బంది, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## అరుణోదయ నాగన్నకు నివాళి



**ప్రజాపక్షం/కారేపల్లి:** కారేపల్లి మండలం మాదారం గ్రామంలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో అరుణోదయ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు అరుణోదయ నాగన్నకు సంతాప సభ నిర్వహించి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆ సంఘం కారేపల్లి మండల కార్యదర్శి వై ప్రకాష్ మాట్లాడుతూ ప్రజా కళారూపాల ద్వారా కార్మిక, కర్షక, శ్రమజీవుల సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఐదు దశాబ్దాల పాటు చైతన్యం కలిగించిన విప్లవ గాయకుడు నాగన్న ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈనెల 13న ఖమ్మం జిల్లా రాజారాం గ్రామంలో జరిగే నాగన్న బహిరంగ సభకు కవులు, కళాకారులు, విద్యార్థులు, యువకులు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో మండల నాయకులు కోయిల శ్రీనివాస్, కావేటి నాగేశ్వరరావు, గడ్డం వెంకన్న, నరేష్, ఎర్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

## సెల్ సిగ్నల్ లేక రైతుల కష్టాలు..!



**ప్రజాపక్షం/గుండాల :** మండల పరిదిలోని కాచనపల్లి పంచాయితీలో బిఎస్ఎన్ఎల్ సిగ్నల్ సక్రమంగా ఉండక పోవడంతో రైతులు యూరియా కట్టలు ఆన్‌లైన్ కాక అనేక ఇబ్బందులకు గురికావడంపై శనివారం న్యూడెమోక్రసి పార్టి ఆధ్వర్యంలో అటికం శేకర్ అధ్యక్షతన ప్రదాన రహదారిపై ఆందోళన నిర్వహించారు. కాచనపల్లి సర్పంచి జర్పుల కిషన్ మాట్లాడుతూ బిఎస్ఎన్ఎల్ సిగ్నల్ రోజుల తరబడి ఉండక పోవడంతో వర్శాకాల సీజన్‌కావడంతో యూరియా కట్టల బుకింగ్ కోసం సిగ్నల్ వచ్చే ప్రాంతాలకు పనులు వదులుకోని వెల్లాల్సిన దుస్థితి ఇక్కడ నెలకొందని అన్నారు. ఈ కార్యక్రమంలో బట్టు ప్రసాద్, బొర్ర వెంకన్న, పూనెం రంగయ్య, ఉపసర్పంచి అశోక్, అటికం నాగేశ్వరావు, యనగంటి లాజర్, పూనెం సత్యం, ప్రవీన్, శ్రీను, సంపత్, విక్రమ్, రవి, బాలు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థికసాయం



**ప్రజాపక్షం/గుండాల :** మండలంలోని శెంభుని గూడెం పంచాయితీలోని సర్వాపురం గ్రామానికి చెందిన కిన్నెర శ్రీనుఅనే వ్యక్తి గత కొద్ది రోజుల క్రితం అనుమాన స్పదంగా మృతిచెందడంపట్ల ఆ కుటుంబానికి అక్కడి స్థానిక సర్పంచి ఈసం సుమలత ఆమే భర్త కాంగ్రెస్ పార్టి నాయకులు ఈసం రాజబాబు మృతుని కుటుంబానికి పదివేలరూపాయలను దశదిన కర్మలకు అందచేసి తన మానవతను చాటుకున్నారు. మృతుని కుటుంబానికి కాంగ్రెస్ పార్టి తరుపున ఎల్లవేళల అండగా ఉంటామని రాజబాబు హామి ఇచ్చారు. ఈ సందర్భంగా వారివెంట దొర కిన్నెర క్రిష్ణ, పటేల్ పూనెం రాంబాబు, అరుణ్, బాబు, రమేష్, పొదుగు జార్జి ఉన్నారు.

# ఆపదలో ఉన్న వారికి ప్రభుత్వం చేయూత

**-సిఎంఆర్ఎఫ్, కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో పొంగులేటి**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఆపదలో ఉన్న ప్రతి నిరుపేద కుటుంబానికి అండగా ఉంటామని, పేదల కన్నీళ్లు తుడవటమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శనివారం ఖమ్మంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఖమ్మం రూరల్ మండలం, ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 129 మంది లబ్దిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.3591500 విలువైన చెక్కులను, ఖమ్మం రూరల్ మండలంకు చెందిన ముగ్గురు లబ్దిదారులకు కళ్యాణలక్ష్మి పథకం ద్వారా మంజూరైన చెక్కులను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ నిరుపేదలకు వైద్య ఖర్చులు భారం కాకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం ద్వారా ఆర్థిక చేయూత అందిస్తున్నామన్నారు. పేదింటి ఆడపిల్లల పెళ్లి భారం కాకుండా ఉండేందుకు కళ్యాణలక్ష్మి పథకం ఎంతో ఆసరాగా నిలుస్తుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ది చేకూరుస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి క్యాంపు కార్యాలయ ఇంచార్జి తుంబూరు దయాకర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# వైరాలో కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

**సిఎం, డిప్యూటీ సిఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం**

**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీకి రూ.53.82 కోట్ల అభివృద్ధి నిధులు మంజూరు కావడం, గోదావరి జలాలు వైరా రిజర్వాయర్‌కు చేరడం, ఆశీర్వాద సభ విజయవంతం కావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ నాయకులు శనివారం వైరా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాలాభిషేకం చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఏదునూరు సీతారాములు ఆధ్వర్యంలో బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ప్రభుత్వం వైరా అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ నిధులు మంజూరు చేయడం, గోదావరి జలాలను వైరా రిజర్వాయర్‌కు తీసుకురావడం ప్రజలకు ఎంతో మేలు చేస్తుందని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కాంగ్రెస్ హెల్త్ అండ్ మెడికల్ సెల్ అధ్యక్షుడు డాక్టర్



కాపా మురళీకృష్ణ, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు శీలం చంద్రశేఖర్ రెడ్డి, 7వ వార్డు కౌన్సిలర్ ఫణితి సైదులు, పమ్మి అశోక్, వుంద్రు శ్యామ్ బాబు, పాలేటి నర్సింహారావు, వేముల రత్నాకర్, వీరంశెట్టి సీతారాములు, తోటకూర శ్రీకాంత్, కంభంపాటి సత్యనారాయణ, తేలూరు వీరయ్య, పెద్దప్రోలు లక్ష్మయ్య, కన్నెగంటి నగేష్, ఏదునూరి శ్రీను, బత్తుల శ్రీను, బీక్యా, దురిశెట్టి నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

# రూ.500కోట్లతో వైరా మున్సిపాలిటీ అభివృద్ధి

**ఎంఎల్ఏ రాందాస్‌నాయక్**



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీని సుందర నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రూ.500కోట్ల వ్యయంతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ తెలిపారు. వైరా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్‌తో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ మాట్లాడుతూ వైరా మున్సిపాలిటీ అభివృద్ధి కోసం అదనంగా రూ.50.82 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఈ నిధులతో శాంతినగర్ నుంచి గండగలపాడు సాయిబాబా ఆలయం వరకు, వైరా రింగు రోడ్డు ఇందిరమ్మ కాలనీ వరకు ఫుట్‌పాత్‌ల నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. అలాగే పాత గ్రామపంచాయతీ ఆసుపత్రి నుంచి రిజర్వాయర్ వరకు వాకింగ్ ట్రాక్ నిర్మాణం కూడా చేపడుతున్నట్లు వెల్లడించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నాయకత్వంలో వైరా మున్సిపాలిటీ వేగంగా అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మూడు రాష్ట్రాల సరిహద్దుల్లో కేంద్ర ప్రాంతంగా ఉన్న వైరాను ఆధునిక పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. సీతారామ ప్రాజెక్ట్ ద్వారా గోదావరి జలాలను అందించడం ద్వారా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చినట్లు చెప్పారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి రూ.4కోట్లు, ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి రూ.50కోట్లు, యంగ్ ఇండియా స్కూల్ నిర్మాణానికి రూ.200కోట్లు, గ్రంథాలయ అభివృద్ధికి రూ.1 కోటి కేటాయించి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. త్వరలో విద్యుత్‌శాఖ నూతన కార్యాలయ భవనానికి శంకుస్థాపన జరుగుతుందని, రింగు రోడ్డు వద్ద రూ.8కోట్లతో వ్యాపార సముదాయం నిర్మాణం చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగామాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ కుటుంబంపై ఎమ్మెల్యే విమర్శలు గుప్పించారు. రాష్ట్రాన్ని భారీ అప్పులు ఊబిలోకి నెట్టారని, గత ప్రభుత్వం చేసిన అప్పుల ఊబిలోకి నెట్టారని, గత ప్రభుత్వం చేసిన అప్పులపై ఇప్పటికీ వడ్డీలు చెల్లించాల్సి వస్తుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా మురళీకృష్ణ, మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్, జిల్లా కాంగ్రెస్ మెడికల్ అండ్ హెల్త్ అధ్యక్షుడు డాక్టర్ కాపా మురళీకృష్ణ, మండల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతారాములు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, కాంగ్రెస్ నాయకులు వుంద్రు శ్యామ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర 3వ మహాసభలను విజయవంతం చేయండి

**గిరిజన సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షులు కుటుంబరావు**



**ప్రజాపక్షం/మణుగూరు:** ఈనెల 18, 19 తేదీల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండల కేంద్రంలో తెలంగాణ గిరిజన సమైక్య మూడవ రాష్ట్ర మహాసభలు జరుగుతున్నాయని ఈ మహాసభలను గిరిజన సమైక్య నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని గిరిజన సమైక్య రాష్ట్ర ఉపాధ్యక్షులు సోందే కుటుంబరావు పిలుపునిచ్చారు. గిరిజనులు ఎదుర్కొంటున్నటువంటి ప్రధాన సమస్యలపై ఈ గిరిజన సమైక్య రాష్ట్ర మహాసభలో చర్చించనున్నామని, రాష్ట్రంలో ఆదివాసీలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను సాధించేందుకు ఈ నెల 18, 19 తేదీల్లో 18వ తేదీన పాల్వంచ పట్టణంలో భారీ ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహించనున్నామని, 19 వ తేదీన లారీ ఓనర్స్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ హాల్ బీసీఎం రోడ్ పాల్వంచలో ప్రతినిధుల మహాసభ జరగనుందని, కావున ఈ మహాసభలకు పినపాక నియోజకవర్గం నుండి ప్రతి మండలం నుండి ,గ్రామాల నుండి పెద్ద ఎత్తున గిరిజనులు తరలిరావాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి గిరిజన సమాఖ్య జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు, సిపిఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర గిరిజన నాయకులు, జిల్లా గిరిజన సమైక్య నాయకులు పాల్గొన నున్నారని, కావున పెద్ద ఎత్తున గిరిజనులు ఈ మహాసభలో హాజర కాగలరని విజ్ఞప్తి చేశారు. అనంతరం కరపత్రం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సమైక్య జిల్లా నాయకులు బాడిషా సతీష్, వజ్జా వెంకటేశ్వర్లు, మండల నాయకులు కనితి సత్యనారాయణ, రామంజవరం సర్పంచ్ బాడిశ కల్పన, చిదేం ఉషారాణి, కన్నెబోయిన ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# సర్వజ్ఞ పాఠశాలలో విద్యార్ధులకు ఎన్నికలు




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని వీడియోస్ కాలనీలో గల సర్వజ్ఞ పాఠశాలలో విద్యార్థులకు ఎన్నికలు నిర్వహించారు. శనివారం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని పాఠశాల ఛైర్మన్ ఆర్‌వి నాగేంద్రకుమార్, డైరెక్టర్ నీలిమ లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవడం ఎంతో అవసరం అన్నారు. ఓటు యొక్క ప్రాధాన్యతను విద్యార్థులకు తెలియజేయడానికి ఈ ఎన్నికలు నిర్వహించామని తెలిపారు. గెలిచిన ప్రతి లీడర్ పాఠశాల క్రమిశిక్షణకు, తోటి విద్యార్థుల ప్రగతికి బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు. డైరెక్టర్ నీలిమ నూతనంగా ఎన్నికైన లీడర్లతో ప్రమాణ స్వీకారం చేయించారు. పదవులు కేవలం హోదా కోసం కాదని బాధ్యతతో కూడుకున్నవని గుర్తు చేశారు. పాఠశాల కీర్తి ప్రతిష్ట ముందుకు తీసుకెళ్లడంలో నూతనంగా ఎన్నికైన లీడర్లు కీలక ప్రాత పోషించాలన్నారు. ఎన్నికల సందర్భంగా విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమకు అభిమానం ఉన్న లీడర్లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఓటరు ఫారం తప్పనిసరిగా ఆన్‌లైన్ చేయించుకోవాలి

**సర్ ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలించిన కట్టా కృష్ణార్జునరావు**



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు పెన్షనర్స్ భవన్‌లో శనివారం నిర్వహిస్తున్న సర్(ఎస్ఐఆర్) ఆన్‌లైన్ ప్రక్రియను బిఆర్ఎస్ జిల్లా నయకులు కట్టా కృష్ణార్జునరావు పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ జరుగుతున్న ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు ఎన్ని దరఖాస్తులు ఆన్‌లైన్ పూర్తయ్యాయో, ఇంకా ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయో వివరాలు సేకరించారు. అనంతరం కట్టా కృష్ణార్జునరావు మాట్లాడుతూ ప్రతి ఓటరు తప్పనిసరిగా తమ ఓటర్ ఫారాన్ని నింపి ఆన్‌లైన్ చేయించుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ నమోదు చేయించుకోకపోతే ఓటు కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రతిఒక్కరూ తమ ఓటు సర్ కార్యక్రమంలో ఆన్‌లైన్ అయిందా లేదా అనేది తప్పనిసరిగా నిర్ధారించుకోవాలని తెలిపారు. అలాగే వార్డులు, పంచాయతీల్లో సర్ ఆన్‌లైన్ కార్యక్రమం పూర్తిస్థాయిలో జరుగుతుందా లేదా, ఓటర్ ఫారాలను ఏవైనా కారణాలతో పక్కడ పెడుతున్నారా అనే అంశాలై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు చల్లా కృష్ణారావు, కార్యదర్శి మాచర్ల జయశంకర్, సామినేని వెంకటేశ్వరరావు, పెద్దిరెడ్డి రామకృష, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

# పేరెంట్స్ కమిటీ పాఠశాల అభివృద్ధికి మార్గదర్శక శక్తి





**ప్రజాపక్షం/ఎర్రుపాలెం** ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం గురకుల పాఠశాలలో తల్లిదండ్రుల భాగస్వామ్యాన్ని మరింతం బలోపేతం చేసే లక్ష్యంతో శనివారం నిర్వహించిన పేరెంట్స్ కమిటీ ఎన్నికలు విజయవంతంగా ముగిశాయని పాఠశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ వి.పరమేశ్వరి తెలిపారు. యాజమాన్యం నిబంధనలకు అనుగుణంగా ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు నిర్వహించినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో కమిటీ చైర్మన్ ఇనగాలికి చెందిన పొట్టపింజర చిట్టిబాబు, వైస్ చైర్మన్‌గా జమలాపురానికి చెందిన ముల్లంగి పూర్ణిమ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా సగ్గుర్తి ముత్యాలరావు, వేల్పుల సుధాకర్, గుడేటి జ్యోతి, ఇనపనూరి కళ్యాణి, ఇనపనూరి ఝాన్సీ, సంగెపు జ్యోతి, సగ్గుర్తి ద్వారక, వెంకటరత్నం, కోట స్వాతి, ద్వారక వెంకటరత్నం, కోట స్వాతి, కొమ్ము ఉదయశ్రీ, తిరుపతమ్మ, కందుకూరి రమ్య, పిల్లలమర్రి స్వాతి, నాగలక్ష్మి, చుక్క జ్యోతి, పులి రాణి, మేరీలు ఎన్నికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఇంచార్జి ప్రిన్సిపాల్ పరమేశ్వరి మాట్లాడుతూ పేరెంట్స్ కమిటీ అనేది కేవలం ఒక కమిటీ మాత్రమే కాదని, పాఠశాల అభివృద్ధికి శక్తిగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# వెంకటేశ్వరునికి ఘనంగా సర్వాంగాభిషేకం ప్రత్యేక పూజలు



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన జమలాపురం శ్రీ వెంకటేశ్వరస్వామి వారికి అమ్మవార్లకు శనివారం పంచామృతాలతో సర్వాంగాభిషేకమును ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ముత్యాల అలంకార రూపంలో స్వామి వారు భక్తులకు దర్శనం ఇచ్చారు. స్వామి వారికి, అమ్మవార్లకు నిత్య కళ్యాణం ప్రధాన అర్చకులు శ్రీనివాశశర్మ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. శనివారం కావడంతో ఆలయానికి వేలాదిగా భక్తులు వచ్చి స్వామి వారిని దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారు. మహిళ భక్తులు పొంగుళ్లు చేసి స్వామి వారికి నివేదన చేసి తమ మొక్కలు చెల్లించుకున్నారు. మహిళ భక్తులు పొంగళ్లు చేసి స్వామి వారికి నివేదన చేసి తమ మొక్కలు చెల్లించుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఉచిత అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఈఓ కొత్తూరు జగన్మోహన్‌రావు, సీనియర అసిస్టెంట్ సోమయ్య, జూనియర్ అసిస్టెంట్ కృష్ణప్రసాద్, అర్చకులు ఎం.వెంకటరమణ, మురళీమోహన్‌శర్మ, రఘురామకృష్ణ శాస్త్రి, రాజీవ్ శర్మ, చక్రధర్, రామకృష్ణశాస్త్రి, వేదపండితులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# పోలవరం ముప్పుపై మౌనం వీడాలి




- ఇప్పటికైనా బ్యాక్ వాటర్ వాస్తవాలు ప్రజల ముందుంచాలి
- అసంపూర్తి కరకట్టను పూర్తి చేయాలి
- కల్లూరి, రావులపల్లి

ప్రజాపక్షం/భద్రాచలం : పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌తో భద్రాచలానికి పొంచి ఉన్న ముప్పు పై కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా మౌనం వీడాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కల్లూరి వెంకటేశ్వర రావు, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు రావులపల్లి రవికుమార్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సిపిఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ గోదావరి ఉగ్రరూపం దాల్చిన ప్రతీసారీ హడావిడి చేయడం, వరదలు తగ్గగానే సమస్యను గాలికొదిలేయడం పరిపాటిగా మారిందన్నారు. రాబోయే గోదావరి వరదలను దృష్టిలో పెట్టుకుని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కదిలి ప్రజలప్రాణాలు, ఆస్తుల రక్షణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. పోలవరం ముంపుపై ప్రజల్లో తీవ్ర గందరగోళం ఏర్పడిందని, శాస్త్రీయ విధానంలో లెక్కలు తేల్చాలన్నారు. ఈ విషయంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దోబూచులాడటం సరైందికాదన్నారు. భద్రాచలం శివారులో నిర్మించే కరకట్ట అసంపూర్తిగా ఉందని, ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. వర్షాకాలంలో ప్రాతినిధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి పట్టణం నుండి మారుమూల ఏజెన్సీ గ్రామాల వరకు నిరంతరం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలు విష జ్వరాల భారిన పడకుండా చూడాలన్నారు. భద్రాద్రి రామాలయాభివృద్ధి జరగడం సంతోషమే అని, జరిగే ప్రతి పనీ నాణ్యతా ప్రమాణాలతో సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు నరాటి ప్రసాద్, కంచర్ల జమలయ్య, కంభంమెట్టు శ్రీనివాస్, మారెడ్డి శివాజీ, మీసాల భాస్కర్ రావు, ఎస్విఎస్ నాయుడు, భద్రాద్రి వెంకటేశ్వరరావు, మహేష్, సాధనపల్లి సతీష్, వేణు, గుంజా రామారావు, సత్తినేడు సాయిరామ్, రుద్ర బ్రదర్స్, చింతల రామరాజు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీలతో వెట్టిచాకిరి సరికాదు



- నేటి నుండి అంగన్వాడీల సమస్యలపై పాదయాత్ర
- ఏఐటియూసి రాష్ట్ర కార్యదర్శి నరాటి ప్రసాద్

ప్రజాపక్షం/భద్రాచలం : రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీలపై పనిభారం మోపుతూ వెట్టిచాకిరీ చేయించడం సరికాదని ఏఐటియూసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్ అన్నారు. శనివారం స్థానిక సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఐటియూసి జిల్లా అధ్యక్షులు కంచర్ల జమలయ్య, అంగన్వాడీ టీచర్స్,హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు గొనె మణితో కలిసి ఆయన మాట్లాడారు. చిన్నారులు, గర్భిణీలు, బాలింతల సంక్షేమంలో కీలకపాత్ర పోషిస్తున్న అంగన్వాడీలను ఆదుకోవాల్సిన ప్రభుత్వమే అదనపు విధుల పేరుతో వేదింపులకు గురి చేయడం సిగ్గు చేటన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం, అధికార యంత్రాంగం నిర్వాకంతో అంగన్వాడీ వ్యవస్థ క్రమంగా కుప్పకూలుతోందన్నారు. కనీస అవసరాలు సమకూర్చకపోగా, సిబ్బందిపై పని భారం మోపడం సరైంది కాదన్నారు. ఈ పరిస్థితి కొనసాగితే వ్యవస్థ నిర్వీర్యం అయ్యే ప్రమాదం ఉందని నరాటి అభిప్రాయం వ్యక్తం చేశారు. బిఎల్ఓ విధులు అప్పగించడం ద్వారా కేంద్రాల నిర్వహణ ఇబ్బందిగా మారిందని సర్వేల పేరుతో బాధ్యతలకు దూరం చేస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి క్రమంలో పౌష్టికాహారం ఎవరు అందిస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో అంగన్వాడీలపై హామీల వర్షం కురిపించిన పాలకులు అధికారంలోకి వచ్చాక మరిచారని, ఇచ్చిన మాట నిలుపుకోవాల్సిన బాధ్యత ముఖ్యమంత్రిపై ఉందన్నారు. నెలకు రూ.15వేల జీతం, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం, ఉద్యోగ భద్రత, పదవీ విరమణ ప్రయోజనాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీల సమస్యల పరిష్కారం కోరుతూ ఆదివారం నుండి రెండు రోజుల పాటు పాదయాత్ర నిర్వహించతలపెట్టామని, ఆ పాదయాత్ర ఆదివారం భద్రాచలం నుండి ప్రారంభమైన సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నాతో ముగుస్తుందని ఆయన చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం నిద్రమత్తు వీడి అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని,లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా బలమైన ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్రకార్యవర్గ సభ్యులు కల్లూరి వెంకటేశ్వర్లు, రాష్ట్ర సమితి సభ్యులు రావులపల్లి రవికుమార్, వేల్పుల మల్లిఖార్జునరావు, మండల రాజు, రత్నకుమారి, చిన్నారి, కంభంమెట్టు శ్రీనివాస్, మారెడ్డి శివాజీ, ఎస్విఎస్ నాయుడు, మీసాల భాస్కర్ రావు, భద్రాద్రి వెంకటేశ్వరరావు, మహేష్, గుంజ రామారావు, సత్తినేడు సాయిరామ్, రుద్ర బ్రదర్స్, చింతలరామారాజు పాల్గొన్నారు.

# రైతులను నట్టేట ముంచుతున్న కాంగ్రెస్



- మళ్లీ మాదే ప్రభుత్వం అంటూ సిఎం జోకులు
- పోలవరంతో భద్రాద్రికి పొంచి ఉన్న ముప్పు
- విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే రేగా

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నట్టేట ముంచుతోందని, రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘోరంగా విఫలమయ్యారని పినపాక మాజీ ఎంఎల్ఏ, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు అన్నారు. శనివారం స్థానిక బిఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతు భరోసాను సకాలంలో ఇవ్వకుండా ముఖ్యమంత్రి పంగ నామాలు పెడుతున్నారని, వ్యవసాయ కూలీలకు ఇస్తానని చెప్పిన రూ.15 వేలు ఏమయ్యాయని ప్రశ్నించారు. రైతులకు నమ్మక ద్రోహం చేసిన నీకు ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని, రానున్న ఎన్నికల్లో 117 సీట్లు గెలుస్తామంటూ ముఖ్యమంత్రి జోక్ చేస్తున్నారని ఎద్దేవా చేశారు. నీ లక్కీ నెంబర్ 9 ప్రకారం 9 సీట్లు గెలిస్తే చాలని, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బిఆర్ఎస్ ఈ సారి పదికి పది సీట్లు గెలిచితీరుతుందని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు పిల్లర్ క్రింద ఇసుకు తోడుతూ ప్రాజెక్టుకు నష్టం చేసే పనులు చేస్తున్నారని, ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేయడం ఎంత వరకు సరైందని ప్రశ్నించారు. సీతారామ ప్రాజెక్టు నీటిని ఖమ్మం జిల్లాకు తరలిస్తూ భద్రాద్రి జిల్లా రైతాంగాన్ని ఈ ప్రభుత్వం అన్యాయం చేస్తోందని మండిపడ్డారు. జిల్లాలో సుమారు వంద మంది రైతులు చనిపోతే వారి కి బీమా సొమ్ము ఇవ్వకుండా వారి కుటుంబాలతో ఆటలాడుతున్నారని ఆవేదనవ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో అవకతవకలు జరుగుతున్నాయని అన్నారు. బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఏనాడూ కరెంటు కష్టాలు లేవని, కాంగ్రెస్ వచ్చిన తర్వాత కరెంట్ కోతలు ఎక్కువవుతున్నాయని చెప్పారు. బిఆర్ఎస్ పాలనలో 37 రకాల వరి వంగడాలకు బోనస్ ఇందించామని, కానీ కాంగ్రెస్ కేవలం ఏడు రకాలకే బోనస్ అనడం విడ్డూలంగా ఉందన్నారు. పోలవరం ప్రాజెక్టుతో భద్రాద్రికి ముప్పు ఉందని, దాని వాస్తవపు లెక్కలను కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు తెలపకపోవడం వెనుక ఉన్న ఆంతర్యమేమిటి చెప్పాలన్నారు. ఈ రెండున్నరేళ్ల పాలనలో ఏ మాత్రం అభివృద్ధి జరిగిందో చూపించాలని, దమ్ముంటే రాజీనామా చేసి ఎన్నికలకు పోదామని, ప్రజలు ఎవరికి బ్రహ్మారథం పడతారో తేలుతుందని చెప్పారు. ఈ విలేకరుల సమావేశంలో కాపు సీతా లక్ష్మీ, కొట్టి వెంకటేశ్వరరావు, సంకుబపన అనుదీప్, వేల్పుల దామోదర్, రాజు గౌడ్, కార్పొరేటర్ సింధు తపస్వి తదితరులు పాల్గొన్నారు.

# వర్షాలు సమృద్ధిగా కురవాలని రైతుల ప్రత్యేక పూజలు

ప్రజాపక్షం/అశ్వాపురం: అశ్వాపురం మండలం మొండికుంట సమీపంలోని చారిత్రక తుమ్మలచెరువు వద్ద మంచి వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షిస్తూ రైతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొండికుంట సర్పంచ్ మర్రి సంధ్యమల్లారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో ఆంజనేయస్వామికి పూజలు చేసి, పులిహోరను నైవేద్యంగా సమర్పించారు. గ్రామ రైతులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని చెరువు నిండాలని, వ్యవసాయానికి అనుకూలంగా వర్షాలు కురవాలని ప్రార్థించారు. వేదమంత్రాలు, భజనలు, గోవింద నామస్మరణలతో తుమ్మల చెరువు పరిసరాలు భక్తి వాతావరణంతో మార్మోగాయి. కాకతీయుల కాలం నాటి తుమ్మలచెరువు ఈ ప్రాంత రైతులకు సాగు నీటి ఆధారంగా నిలుస్తోందని గ్రామ పెద్దలు తెలిపారు. పూజల అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

# తడవని మడి.. రైతుల్లో అలజడి..!

- వరిసాగుపై నీలినీడలు - పత్తాలేని వర్షపు చుక్కలు



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : ఆకాశ గంగ అలిగినట్లుగా ఉంది ప్రస్తుత పరిస్థితి. మేఘాలు వర్షించకపోవడంతో ఒక్క నీటి చుక్కుకూడా నేలరాలక పోవడంతో మడులు తడవక బీళ్లుగా దర్శనమిస్తుండటంతో రైతుల్లో వానా కాలం సాగుపై తీవ్ర అలజడి మొదలైంది. ఒక వైపు ఎల్‌నినో ప్రభావంతో మేఘాలు మందగించి వానలు ముఖం చేటాశాయి. రైతులను వర్షాభావ పరిస్థితులు వెంటాడుతున్నాయి. వానా కాలం సీజన్ ప్రారంభమై నెలన్నర రోజులు కావస్తున్నా జిల్లాలో ఆశించిన స్థాయిలో వర్షాలు పడలేదు. జిల్లాలో ఈ వానాకాలంలో వరి 1లక్ష 75వేల ఎకరాలు, పత్తి 2 లక్షల 10 వేల ఎకరాలు, ఆయిల్ ఫామ్ 90 వేల ఎకరాలు,మొక్కజొన్న 80వేల ఎకరాలతో పాటు మొత్తం 6,37,800 ఎకరాల్లో సాగు చేయనున్నారు. జిల్లాలో భూగర్భజలానికి లోటు లేకున్నప్పటికీ ఆకాశవాయిపై పండే పంటల పరిస్థితి ఆందోళనగా మారింది. ఆశించిన స్థాయిలో వానల లేకపోవడంతోపాటు ఇతర పంటల సాగుపై నీలినీడలు అలుముకుంటున్నాయి. అక్కడక్కడా నారుమళ్లు వేసినప్పటికీ వర్షం లేకపోవడంతో వాటిని నాటే పరిస్థితి లేదు, ఇక పోతే ఒక్క విత్తు కూడా నేలను తాకింది లేదు. ఇప్పటికైనా వర్షాలు మెండుగా పడాలని రైతన్నలు వాన దేవున్ని మొక్కుతున్నారు.

# గిరిజన హక్కుల పరిరక్షణకు పెద్దఎత్తున పోరాటాలు

- టిజిఎస్ రాష్ట్ర అధ్యక్షులు అజ్మీరా రామ్మూర్తి నాయక్




ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : గిరిజన హక్కుల పరిరక్షణ కోసం రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున రాజీలేని పోరాటాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని తెలంగాణ గిరిజన సమాఖ్య (టిజిఎస్) రాష్ట్ర అధ్యక్షులు అజ్మీరా రామ్మూర్తి నాయక్ అన్నారు. జిల్లాలోని పాల్వంచ పరిధిలో ఈ నెల 18,19తేదీల్లో గిరిజన సమాఖ్య రాష్ట్ర 3వ మహాసభల ప్రచార కరపత్రాలను శనివారం స్థానిక శేషగిరిభవన్ సిపిఐ జిల్లా కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలు, సవాళ్లు, సాగిస్తున్నపోరాటాలు తదితర కీలక అంశాలపై ఈ మహాసభల్లో విస్తృతంగా చర్చించనున్నట్లు తెలిపారు. గిరిజన సమాజం అంతా ఏకమై ఈ రాష్ట్ర మహాసభల ఏర్పాట్లను వేగవంతం చేయాలని, సభ విజయవంతానికి కదలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ బి వెంకట్, నాయకులు జర్పుల ఉపేందర్, బానోత్ వీరన్న తదితరులు పాల్గొన్నారు.

# ఎన్యుమరేషన్ ఫారాలు అందరికీ అందేలా చూడాలి



ప్రజాపక్షం/చుంచుపల్లి: ఎన్యుమరేషన్ ఫారా లు అందరికీ అందేలా చూడాలని సమగ్ర అభివృద్ధి వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు కొండపల్లి శ్రీధర్ కోరారు. శనివారం చుంచుపల్లి మండలం రాంనగర్ గ్రామపంచాయతీలోని తెలంగాణ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ భవన్ నందు సమగ్ర అభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికీ ప్రతి ఇంటికి ఎన్యుమరేషన్ ఫారాలు చేరలేదని, చాలామంది ఓటర్లకు తమ ఓటు ఏ పోలింగ్ బూత్‌లో ఉందో తెలియని పరిస్థితి ఏర్పడుతోందని అన్నారు. అటువంటి ఓటర్ల కోసం ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేసి, వారి ఓటు వివరాలను సులభంగా తెలయజేసే ఏర్పాట్లు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రిటైర్డ్ ఎంప్లాయిస్ సంఘం జిల్లా నాయకులు రాయి మోహన్‌రావు, కోశాధికారి బి.వెంకటేశ్వర్లు, కార్యదర్శి ఎస్.సాయిబాబా, సమగ్ర అభివృద్ధి వేదిక నాయకులు కె.వి.సీతారాం తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ విగ్రహావిష్కరణకు భారీగా తరలిరావాలి



ప్రజాపక్షం/చుంచుపల్లి: చుంచుపల్లి మండలంలోని నందా తండా గ్రామపంచాయతీ పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన భారతరత్న, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణకు అన్ని ఏర్పాటు పూర్తయ్యాయని, ప్రజలు భారీగా తరలిరావాలని హౌసింగ్ బోర్డు అంబేద్కర్ విగ్రహ స్థాపన కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం హౌసింగ్ బోర్డు కాలనీలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఈ నెల 12వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 3.00 గంటలకు తెలంగాణ కార్మిక, ఉపాధి కల్పన, పరిశ్రమలు, గనులు, భూగర్భ వనరుల శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి చేతల మీదుగా విగ్రహాన్ని ఘనంగా ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, వర్ధన్నపేట శాసనసభ్యులు కె.ఆర్.నాగరాజు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ పటేల్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజుతోపాటు ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాలు, సామాజిక సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు, యువజన, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో హౌసింగ్ బోర్డు అంబేద్కర్ విగ్రహ స్థాపన కమిటీ అధ్యక్షుడు తుంపూరి శివ, కార్యదర్శి తాండ్ర వెంకటేశ్వర్లు, సభ్యులు శనగ వెంకటేశ్వర్లు, గొనె శ్రీకాంత్, గుర్రం లక్ష్మణ్, గడ్డం రగన్ బాబు, శనగ స్వామి తదితరులు పాల్గొన్నారు.

# పంచాయితీ భవన ప్రారంభంపై అసంతృప్తి

ప్రజాపక్షం/అశ్వాపురం: చింతిర్యాల కాలనీ గ్రామ పంచాయితీ నూతన భవన ప్రారంభోత్సవాన్ని హడావుడిగా నిర్వహించడంపై సర్పంచ్ కొరసా అలివేలు, ఉప సర్పంచ్ వెన్న అశోక్ కుమార్ అసంతృప్తి వ్యక్తం చేశారు. సర్పంచ్ ఆరోగ్యం బాగోలేదని కార్యక్రమాన్ని వాయిదా వేయాలని కోరినా అధికారులు పట్టించుకోలేదని ఆరోపించారు. ఎన్ఆర్ఈజిఎస్ నిధుల కింద 2023లో రూ 20లక్షలతో మంజూరైనా భవనం ఆలస్యంగా పూర్తయిందని, సర్పంచ్, ఉప సర్పంచ్, కాంట్రాక్టర్ కృషితో పనులు పూర్తయ్యాయని తెలిపారు. అధికారులు అన్ని గ్రామ పంచాయితీలను సమానంగా చూడాలని, నిధుల కేటాయింపులో వివక్ష చూపితే సర్పంచులు, ఉప సర్పంచులతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

# బిఎల్‌ఏలు క్రియాశీలకంగా పనిచేయాలి

**-మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్**



**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** ఓటరు ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమంలో బిఎల్‌వోలతో బిఎల్‌ఏలు సమన్వయం చేసుకుంటూ క్రియాశీలకంగా పనిచేయాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. శనివారం రఘునాథపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్ఐఆర్ కార్యక్రమంపై బిఎల్‌ఏలకు మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ దిశా నిర్దేశం చేశారు. ఓటరు ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో పార్టీ తరుపున బూత్ లెవల్ ఏజెంట్లు (బిఎల్ ఏ)లు క్రియాశీలకంగా పనిచేయాలన్నారు. ప్రతి ఓటు ఓటరు జాబితాలో ఉండేలా చూడాలన్నారు. ఎన్యూమరేషన్ ఫారాలు ఓటరుకు పంపిణీ చేయడంతో పాటు వాటిని పూర్తి చేసి బిఎల్‌వోలకు అందించేలా బిఎల్‌ఏలు సహకారం అందించాలన్నారు. సమన్వయ కమిటీ బిఎల్‌వోలతో నిరంతరం మాట్లాడుతూ సర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో కృషి చేయాలన్నారు. అదేవిధంగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ముమ్మరం చేయాలని, ఇచ్చిన లక్ష్యం మేరకు సభ్యత్వాలు పూర్తి చేయాలన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ మద్దినేని వెంకటరమణ, సమన్వయ కమిటీ సభ్యులు గుత్తా రవి, మెంటెం రామారావు, పిన్ని కోటేశ్వరరావు, కొంటెముక్కుల వెంకటేశ్వర్లు, సర్పంచుల సంఘం మండల మాజీ అధ్యక్షులు మాధంశెట్టి హరిప్రసాద్, ఆత్మ మాజీ ఛైర్మన్ భూక్యా లక్ష్మణ్ నాయక్, సర్పంచ్ శంకర్, నాయకులు పొట్లపల్లి నాగరాజు, కుతుంబాక నరేష్, గంగిరెడ్డి విజయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సర్ ప్రక్రియను పరిశీలించిన ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి

**ప్రజాపక్షం/మణుగూరుః** తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా బూత్ లెవెల్ అధికారులు పంపిణీ చేసే ఎన్యూమరేషన్ పత్రాన్ని పూర్తిగా నింపి సమర్పిస్తేనే రాబోయే డ్రాఫ్ట్ (ప్రాథమిక) ఓటర్ల జాబితాలో పేరు కొనసాగుతుందని పినపాక 110 (ఎస్టి) నియోజకవర్గం ఈఆర్ఓ మరియు భద్రాచలం ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ సంబంధిత ఓటర్లకు సూచించారు. శనివారం పినపాక అసెంబ్లీ నియోజకవర్గం లోని మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని పోలింగ్ స్టేషన్ల వార్డులలో విస్తృతంగా పర్యటించి, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో సంబంధిత ఓటర్లు నమోదు ఏవిధంగా చేసుకోవాలో వారికి సూచించారు. ఈ సందర్భంగా ఆయన ఓటర్ల ఇంటింటికి తిరిగి పలు సలహాలు, సూచనలు ఇచ్చిన అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హులైన ఓటర్లను గుర్తించి, బోగస్ ఓట్లను తొలగించేందుకు దాదాపు 24 ఏళ్ల తర్వాత అనగా 2002లో సమగ్ర సర్వే ప్రక్రియ జరిగిందని, ఇప్పుడు జరుగుతున్న ఈ భారీ కసరత్తులో ప్రతి ఓటరు భాగస్వామ్యం కావడం తప్పనిసరి అని పేర్కొన్నారు. ఒకవేళ ఏవైనా కారణాల వల్ల జూలై 31న విడుదలయ్యే డ్రాఫ్ట్ జాబితాలో పేరు లేకపోయినా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో క్లెయిమ్‌లు, అభ్యంతరాల గడువులోగా ఫామ్6 ద్వారా కొత్త



ఓటు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన సూచించారు. సంబంధిత బిఎల్వోలు వారి పోలింగ్ స్టేషన్ పరిధిలోని ఇంటింటికి తిరిగి ఎన్యూమరేషన్ ఫారాలు అందజేస్తున్నందున ఓటర్లు తప్పనిసరిగా పూర్తి వివరాలు బిఎల్వోలకు తెలియజేసి ఎన్యుమరేషన్ ఫారాలు పూరించి వారికి అందజేయాలని, బిఎల్వోలకు అందించిన తర్వాత తప్పనిసరిగా రశీదు తీసుకోవాలని మీ ఇంటిలోని అర్హులైన ప్రతి ఒక్కరి పేర్లు తప్పనిసరిగా ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో నమోదు చేయించుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మణుగూరు మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావు ఎలక్షన్ డ్యూటీ అనూష డిటి రామారావు ఆర్ఐ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# వైరా రిజర్వాయర్‌కు గోదావరి జలాల రాకతో బిఆర్ఎస్ పూజలు

**ప్రజాపక్షం/వైరాః** వైరా రిజర్వాయర్‌కు గోదావరి జలాలు చేరిన సందర్భంగా శనివారం వైరాలోని రిజర్వాయర్ బతుకమ్మ ఘాట్ వద్ద బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గంగమ్మ తల్లికి పసుపు, కుంకుమ, చీరతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.





ఈ సందర్భంగా బిఆర్ఎస్ జిల్లా నాయకులు కట్టా కృష్ణార్జునరావు, బాణాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్ట్ మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టారని అన్నారు. ఈ ప్రాంత వ్యవసాయాభివృద్ధి కోసం గోదావరి–కృష్ణా జలాలను అనుసంధానం చేస్తూ సీతారామ ప్రాజెక్ట్‌ను నిర్మించారని, బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలోనే 80% పనులు పూర్తి చేశారని తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేయాలనే లక్ష్యంతో గోదావరి జలాలను ఈ ప్రాంతానికి తీసుకురావడానికి కెసిఆర్ నిరంతరం కృషి చేశారని పేర్కొన్నారు. వైరా రిజర్వాయర్‌కు గోదావరి జలాలు చేరడం కెసిఆర్ దూరదృష్టి, పట్టుదల, కృషికి నిదర్శనమని అన్నారు. ప్రాజెక్ట్ నిర్మాణాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ వేగంగా పనులు పూర్తి చేయించిన ఘనత కూడా కెసిఆర్‌ది దుక్కుతుందని పేర్కొన్నారు. గోదావరి జలాల రాకతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వేలాది ఎకరాలు సాగులోకి వచ్చి రైతులకు మేలు జరుగుతుందని, ఈ ప్రాంతం పచ్చని పంటలతో కళకళలాడాలనే, సంకల్పమే నేడు ఫలించిందని కట్టా కృష్ణార్జునరావు అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు కట్టా స్వరూపరాణి, మాదినేని సునీత, చిలకా కోటయ్య, బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మద్దెల రవి, అప్పం సురేష్, సిరిపురం సర్పంచ్ శెట్టిపల్లి శ్రీనివాసరావు, కామినేని శ్రీనివాసరావు, లాల్‌మహ్మద్, దారెల్లి పవిత్రకుమారి, పరుచూరి రామారావు, నూకల వాసు, నూకల ప్రసాద్, ఏదునూరి శ్రీను, కొల్లా రాంబాబు, ఏనుగు హనుమంతరావు, వజినేపల్లి చక్రవర్తి, మాదినేని లక్ష్మణ్, ఆదూరి ప్రేమ్, కారుకొండ బోసు, వేముల శివకుమార్, తన్నీరు నాగేశ్వరరావు, దాసరి శ్రీను, మాచర్ల శంకర్ పాల్గొన్నారు.

# కాంగ్రెస్ హయాంలోనే సీతారామ ప్రాజెక్టు పనులు వేగవంతం

**-కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఓరుగంటి రమేష్ బాబు**

**ప్రజాపక్షం/అశ్వాపురం:** సీతారామ ప్రాజెక్టుపై గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించి, నిధులు కేటాయించకుండా పనులను ఆలస్యం చేసిందని కాంగ్రెస్ పార్టీ అశ్వాపురం మండల అధ్యక్షుడు ఓరుగంటి రమేష్ బాబు ఆరోపించారు. అశ్వాపురంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో సీతారామ ప్రాజెక్టు పనులు నత్తనడకన సాగాయని, ప్రాజెక్టు పూర్తి చేయడంలో నిర్లక్ష్యం జరిగిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రత్యేక చొరవతో నిధులు మంజూరు చేసి, భూసేకరణతో పాటు



పనులను వేగవంతం చేశారని తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా మంత్రుల కృషితో సీతారామ ప్రాజెక్టు పనులు పూర్తయి గోదావరి జలాలు రైతుల పొలాలకు చేరనున్నాయని అన్నారు. మాజీ ఎంఎల్ఏ రే గా కాంతారావు సీతారామ ప్రాజెక్టును కేసీఆర్ పూర్తి చేశాడని చెప్పడం అవాస్తవమని పేర్కొన్నారు. పినపాక నియోజకవర్గ ఎంఎల్ఏ పా యం వెంకటేశ్వర్లు నియోజకవర్గంలోని ప్రతి ఎకరానికి సాగునీరు అందేలా ప్రభుత్వంతో సమన్వయం చేస్తూ కృషి చేస్తున్నారని తెలిపారు. మారేళ్లపాడు ఎత్తిపోతల పథకం పనులను కూ డా ఎంఎల్ఏ పాయం పర్యవేక్షిస్తూ అశ్వాపురం, మణుగూరు మండలాలకు సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.

# ఎల్‌వోసి చెక్కు అందజేత

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన ఎల్‌వోసి చెక్కును కాంగ్రెస్ యువ నాయకులు తుమ్మల యుగంధర్ శనివారం అందజేశారు. ఖమ్మం నగరంలోని 46వ డివిజన్‌కు చెందిన గోనెల వీరమ్మ కిడ్నీ సంబంధిత అనారోగ్యంతో బాధపడుతున్నారు. స్థానిక నాయకులు బానాల లక్ష్మణ్ ద్వారా విషయం తెలుసుకున్న తుమ్మల యుగంధర్ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సిఫారసు మేరకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన ఎల్‌వోసి రూ. 1.75 లక్షల చెక్కును వీరమ్మ కుమారుడు భువనేశ్వర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు భువనేశ్వర్ కృతజ్ఞతలు తెలిపారు.



# శ్రీ కళ్యాణ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో అన్నదానం

**ప్రజాపక్షం/మధిర మున్సిపాలిటీః** శ్రీ కళ్యాణ వెంకటేశ్వరస్వామి దేవాలయం వర్తక సంఘంలో వేంచేసి ఉన్న శ్రీ కళ్యాణ వెంకటేశ్వరస్వామి దేవాలయం నందు ప్రతి శనివారం అన్నదానం జరుగుతును, శనివారం అన్నదాతలు శ్రీమాన్ పుల్లఖండం చంద్రశేఖర్, ధర్మపత్ని పద్మావతి జంగాల గీష్మ జ్ఞాపకార్ధం తల్లిదండ్రులు వెంకట్రావు, జ్యోతి నాళ్ళ రాఘవయ్య మాణిక్యం జ్ఞాపకార్ధం కుమారుడు కోటేశ్వరరావు జ్ఞాపకార్ధం వారి సాయంతో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని నిర్వాహకులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కపిలవాయి జగన్మోహన్ రావు, వెచ్చా శ్రీనివాసరావు , కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



# దెందుకూరులో డ్రైనేజీ పూడికతీత పనులు

**ప్రజాపక్షం/మధిర మున్సిపాలిటీః** దెందుకూరు గ్రామంలోని సైడ్ కాల్వల్లో పేరుకుపోయిన పూడిక(మట్టి, చెత్త, ప్లాస్టిక్) వలన మురుగునీరు నిలిచిపోయి దోమలు వృద్ధి చెంది దుర్వాసన వస్తున్నాయి. రానున్న వర్షాకాలంలో ఇవి పొగిపొర్లే ప్రమాదం మరింత ఉంది. ప్రజారోగ్యం దృష్ట్యా దీనిని గమనించిన గ్రామ సర్పంచ్ పగిడిపల్లి శ్రీనివాసరావు దగ్గరుండి డ్రైనేజీ పూడికతీత పనులు చేయించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పగిడిపల్లి శ్రీనివాసరావు, వార్డు సభ్యులు పగిడిపల్లి కిషోర్, గ్రామస్థులు ఉన్నారు.





# పల్మోకాన్ 2026లో ఖమ్మం వైద్యుడికి ప్రతిష్టాత్మక గోల్డ్ మెడల్

**-డిఫరెన్షియేటెడ్ టిబీ కేర్ మోడల్‌పై శాస్త్రీయ ప్రదర్శనకు జాతీయ స్థాయి గుర్తింపు**

**ప్రజాపక్షం/ఖమ్మం వైద్యవిభాగంః** క్షయ వ్యాధి నియంత్రణ రంగంలో ఖమ్మం జిల్లా మరోసారి ప్రత్యేక గుర్తింపు పొందింది. జిల్లా క్షయ నియంత్రణ అధికారి (డిటిసీఓ) డాక్టర్ వరికూటి సుబ్బారావు తెలంగాణ పల్మోకాన్ 2026 సదస్సులో తన ప్రతిభను చాటుకుని ప్రతిష్టాత్మక డాక్టర్ కన్వల్‌చందర్ ఒరేషన్ గోల్డ్ మెడల్ 2026 అవార్డును శనివారం అందుకున్నారు. సదస్సులో ఆయన డిఫరెన్షియేటెడ్ టిబీ కేర్ మోడల్ అంశంపై సమర్పించిన శాస్త్రీయ ప్రదర్శనకు పలువురు పల్మనాలజిస్టులు, వైద్య నిపుణులు, ప్రజారోగ్య శాస్త్రవేత్తలు నుంచి విశేష ప్రసంసలు లభించాయి. క్షయవ్యాధి నిర్మూలనలో రోగి అవసరాలను అనుగుణంగా చికిత్స అందించే విధానాలు, వినూత్న సేవలు అమలు, శాస్త్రీయ పరిశోధనలకు చేసిన కృషిని గుర్తిస్తూ ఈ ప్రతిష్టాత్మక అవార్డును ప్రదానం చేశారు. డాక్టర్ వరికూటి సుబ్బారావు నాయకత్వంలో ఖమ్మం జిల్లాలో క్షయవ్యాధి నియంత్రణ కార్యక్రమాలు సమర్థవంతంగా అమలవుతున్నాయని వైద్య వైద్య రంగానికి ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చిందని ఆరోగ్యశాఖ అధికారులు, వైద్యులు సహచరులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. ఈ అవార్డు ద్వారా ఖమ్మం జిల్లా వైద్య సేవల నాణ్యత, క్షయవ్యాధి నియంత్రణలో చేపడతున్న వినూత్న కార్యక్రమాలకు రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందని వారు పేర్కొన్నారు.



# అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన ఎంఎల్ఏ పాయం

**-పంచాయితీ భవనం ప్రారంభం, ఆరోగ్య కేంద్రం, పాఠశాలల పరిశీలన**

**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురం మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులను పినపాక ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లు ప్రారంభించారు. చింతిర్యాల కాలనీలో రూ 20లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయితీ కార్యాలయ భవనాన్ని ప్రారంభించిన ఎంఎల్ఏ, ప్రహరీ గోడ నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తామని తెలిపారు. అనంతరం అశ్వాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. రామచంద్రాపురంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ప్రారంభించి, రామచంద్రాపురం, వెంకటాపురం గ్రామాల్లో మూడు బ్యాండ్ బోర్లను ప్రారంభించారు. గ్రామస్తులు సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వెంకటాపురం ఎంపీపీఎస్‌లో వసతులు, మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించిన ఎంఎల్ఏ, గొందిగూడెంలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని లబ్దిదారులను అభినందించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఓరుగంటి రమేష్ బాబు, సీనియర్ నాయకులు గాదె కేశవరెడ్డి, ఊసా అనిల్‌కుమార్, పలువురు సర్పంచులు, ఉప సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

